మన
# నేషనలిస్ట్ వాయిస్
తెలుగు దిన పత్రిక

RNI : TGTEL/25/A4284

www.manannationalistvoice.com    epaper.manannationalistvoice.com

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 190 | 07 ఆదివారం, జూన్ 2026 | పేజీలు :12 | వెల: రూ. 3/-

హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్ నగర్, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, అమరావతి, క్రిష్ణ, గోదావరి, కర్నూలు, చిత్తూరు, కడప, ప్రకాశం, శ్రీకాకుళం




# 210 మంది చిన్నారులకు సైకిళ్ళు అందజేసిన జగ్గారెడ్డి

సంగారెడ్డి, నేషనలిస్ట్ వాయిస్ :

**టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యం లో చిన్నారులకు విడతలవారీగా సైకిళ్ళ పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. ఇప్పటి వరకు 400 మంది చిన్నారులకు సైకిళ్ళు పంపిణీ చేసిన జగ్గారెడ్డి శనివారం మరో 210 మంది చిన్నారులకు సైకిళ్ళు పంపిణీ చేశారు.**



## సత్వరంగా మహిళా సమాఖ్య భవన నిర్మాణాలు

### అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క

హైదరాబాద్,జూన్6నేషనలిస్ట్ వాయిస్ (న్యూస్ ప్రతినిధి) :



మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలు వేగవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. 8 వేల గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. ఇవి మహిళల ఆత్మగౌరవ భవనాలని మంత్రి సీతక్క అభివర్ణించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సర్ అధికారులతో మంత్రి సీతక్క శనివారం సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. మహిళా భవనాల నిర్మాణ పురోగతిని రోజూ పరిశీలిస్తామని తెలిపారు. ఈ నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం సహించ బోమని హెచ్చరించారు. ఎంపీడీవోలు ఈ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత, పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులు నిరంతర పర్యవేక్షించాలని దిశానిర్దేశర చేశారు. ఉపాధి హామీ పనుల అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి పనుల్లో లక్ష్యాల సాధించాలని అధికారులకు.. మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

- ఇదే తమ మొదటి డిమాండ్..కొనసాగిస్తాం కూడా
- ప్రవేశ పరీక్షల అవతవకలకు బాధ్య వహించాల్సిందే
- కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే డిమాండ్
- జంతర్ మంతర్ వద్ద ధర్నా...ధర్నాలో పాల్గొన్న పర్యావరణవేత్త వాంగ్‌చుక్

న్యూఢిల్లీ,జూన్6నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ప్రతినిధి




నీట్ తదితర ప్రవేశ పరీక్షలు, రిక్రూట్మెంట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను పరిష్కరించేందుకు ప్రస్తుత విద్యా వ్యవస్థను సంస్కరించాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ శనివారంనాడు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించింది.

మిగతా 2లో




# అష్టదరిద్రులు అడ్డంపడ్డా అభివృద్ధి ఆగదు

- ఎవరెంత ఏడ్చినా.. ఆర్ఆర్ఆర్ నిర్మిస్తాం
- …డగ చేయడమే మా లక్ష్యం
- వరి వేస్తే ఉరి అనే రోజులు పోయాయి
- కాళేశ్వరం లేకున్నా లక్ష టన్నుల ధాన్యం పండింది
- ఇంతకాలం ఎక్కడ నీళ్లున్నా కాళేశ్వరం అంటూ ప్రచారం
- ధాన్యం కొనకుంటే మోడీ సంగతి తేలుస్తాం
- అభివృద్ధి నిరోధకంగా బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు
- కోహెడ పండ్ల మార్కెట్‌కు శంకుస్థాపనలో సిఎం రేవంత్ రెడ్డి

రంగారెడ్డి,జూన్6నేషనలిస్ట్ వాయిస్ (న్యూస్ ప్రతినిధి) :

రంగారెడ్డి జిల్లాలోని కోహెడలో నిర్మించనున్న సమీకృత పండ్ల మార్కెట్ మనకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. స్థానికంగా పండ్ల మార్కెట్‌తో పాటు ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కాంప్లెక్స్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. నగరంలోని పండ్ల మార్కెట్‌ను కోహెడకు తరలించినప్పుడు తాత్కాలిక టెంట్లు వేశారు. గాలివాన వచ్చినప్పుడు రైతులకు గాయాలయ్యాయి. ఇంటిగ్రేటెడ్ పండ్ల మార్కెట్ నిర్మిస్తానని నాడు ఎంపీగా[illegible] హామీ

మిగతా 2లో

## ప్రభుత్వ భూములను పెద్దలకు దోచిపెడుతున్న రేవంత్

భూదందాలో సిఎం కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ ప్రముఖులు

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపణలు

హైదరాబాద్,జూన్6నేషనలిస్ట్ వాయిస్



## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

### ఇరాన్ డ్రోన్లను కూల్చిన అమెరికా సైన్యం

### ర్మూజ్ జలసంధి వద్ద మళ్లీ ఉద్రిక్తతలు

టెహ్రాన్,జూన్6నేషనలిస్ట్ వాయిస్ (న్యూస్ ప్రతినిధి) :

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మళ్లీ ముసురుతున్నాయి. హోర్ముజ్ జలసంధి లక్ష్యంగా ఇరాన్ ప్రయోగించిన నాలుగు డ్రోన్లను అమెరికా సైన్యం కూల్చివేసింది. దీనికి ప్రతీకారంగా, ఇరాన్ తీరప్రాంతంలోని నిఘా రాడార్ కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులకు దిగింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది.హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు ఇరాన్ డ్రోన్ల వల్ల తక్షణ ముప్పు పొంచి ఉందని అమెరికా సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. ఆత్మరక్షణ చర్యల్లో భాగంగానే జలసంధిలోని ఒక ద్వీపంతో పాటు ఇరాన్ తీరంలోని కీలక రాడార్ సైట్‌లపై తాము దాడులు చేసినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. మరోవైపు, ప్రపంచ ఇంధన సరఫరాకు గుండెకాయ లాంటి హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధించేందుకు ఇరాన్ ప్రయత్నిస్తుండగా, అందుకు ప్రతిగా అమెరికా ఇరాన్ రేవులపై ఆంక్షలు, దిగ్బంధనాన్ని విధిస్తోంది. ఈ వారంలోనే కువైట్ ప్రధాన విమానాశ్రయంలోని ప్యాసింజర్ టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరు మరణించగా, డజన్ల కొద్దీ ప్రయాణికులు గాయపడ్డారు. దీనివల్ల ఎయిర్‌ఫీల్డ్ తాత్కాలికంగా మూతపడింది.

# సహారా ఎడారిలో మృత్యు ఘోష

## - నీళ్లు లేక 49మంది మృత్యువాత

సహారా,జూన్6నేషనలిస్ట్ వాయిస్ (న్యూస్ ప్రతినిధి) :

పశ్చిమాఫ్రికాలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. సహారా ఎడారిలో తాగేందుకు నీరు దొరక్క దాహంతో 49 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు ఆగిపోవడంతో వీరంతా కొన్ని రోజుల పాటు ఎడారిలో నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. నైజర్ దేశంలో ఈ దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నైజర్‌కు చెందిన కొంతమంది తమ బంధువులతో పండుగ చేసుకునేకుందుకు పక్కనే ఉన్న మాలి దేశానికి ట్రక్కులో బయల్దేరారు. ఆ వేడుక ముగించుకొని తిరిగివస్తుండగా.. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు అసమాకా అనే సరిహద్దు ప్రాంతానికి 80 కిలోమీటర్ల దూరంలో ఆగిపోయింది. అయితే, ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటంతో సాయం చేసేవారు దొరకలేదు. డ్రైవర్‌తో పాటు అందులోని ప్రయాణికులు ట్రక్కును మరమ్మతు చేసేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. దీంతో వారంతా కొన్ని రోజుల పాటు ఎడారిలోనే ఉండాల్సి వచ్చింది. అప్పటికే వారి వద్ద ఉన్న నీటి నిల్వలు నిండుకున్నాయి.



ఎడారిలో నీటి జాడ లేకపోవడంతో వారు దాహంతో అల్లాడిపోయారు. చివరకు ఇద్దరు వ్యక్తులు దాదాపు 50 కిలోమీటర్లకు పైగా కాలినడకన వెళ్లి నీరు తాగి అక్కడినుంచి అసమాకా పట్టణానికి చేరుకున్నారు. అక్కడ అధికారులను కలిసి విషయం చెప్పారు. అప్రమత్తమైన అధికారులు ఘటనా స్థలానికి చేరుకోగా.. హృదయ విదారక దృశ్యాలు కన్పించాయి. ట్రక్కు చుట్టూ డజన్ల కొద్దీ మృతదేహాలు కన్పించాయని అధికారులు తెలిపారు. విపరీతమైన వేడి, ఉక్కపోత, నీరు లేక 49 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. అయితే, ట్రక్కు ఆగిపోవడానికి కారణమేంటీ, వీరు ఎడారిలో ఎన్ని రోజులు చిక్కుకుపోయారన్న దానిపై స్పష్టత లేదు.

## పశ్చిమాసియా ఘర్షణల నేపథ్యం

### - ఆర్థిక సలహా మండలితో ప్రధాని సమావేశం

న్యూఢిల్లీ,జూన్6నేషనలిస్ట్ వాయిస్ (న్యూస్ ప్రతినిధి) :

పశ్చిమాసియా ఘర్షణల నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ కీలక భేటీకి అధ్యక్షత వహించారు. శనివారం పీఎం–ఆర్థిక సలహా మండలితో సమావేశయ్యారు. యుద్ధం ముగింపుపై అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో యుద్ధ ప్రభావాన్ని తగ్గించే చర్యలపై చర్చించినట్లు సమాచారం. ఆర్థికవృద్ధిని బలోపేతం చేయడం, బయటి నుంచి వచ్చే ఒడుదొడుకులను తట్టుకునే సామర్థ్యాన్ని పెంచడం, వ్యాపారాలకు మరింత అనువైన వాతావరణాన్ని కల్పించేలా సంస్కరణలు వేగవంతం చేయడం వంటి అంశాలపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది.

## ఆపరేషన్ బ్లూ స్టార్ 42వ వార్షికోత్సవం

### అకాల్ తఖ్త్ వద్ద ఖలిస్తాన్ అనుకూల నినాదాలు

చండీఘడ్,జూన్6నేషనలిస్ట్ వాయిస్ (న్యూస్ ప్రతినిధి) :

పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఉన్న ప్రముఖ సిక్కు మత కేంద్రం అకాల్ తఖ్త్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఆపరేషన్ బ్లూ స్టార్ 42వ వార్షికోత్సవం సందర్భంగా ఖలిస్థాన్ అనుకూల నినాదాలు వినిపించాయి. సిక్కు మిలిటెంట్ నాయకుడు జర్నైల్ సింగ్ భింద్రాన్‌వాలే పోస్టర్లు వెలిశాయి. జూన్ 6, 1984న భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ బ్లూ స్టార్‌లో భింద్రన్‌వాలే మరణించారు.ప్రతి ఏటా జూన్ 6వ తేదీన సిక్కు సమాజంలోని కొన్ని వర్గాలు 'ఘల్లోఘారా దివస్'గా పాటిస్తాయి. ఈ ఏడాది కూడా భింద్రన్ వాలేను స్మరించుకుంటూ కొందరు కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో శాంతి భద్రతలను కాపాడేందుకు పంజాబ్ పోలీసులు అమృత్‌సర్, దాని పరిసర ప్రాంతాలలో విస్తృతమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. శాంతిభద్రతల ప్రత్యేక డైరెక్టర్ జనరల్ ప్రవీణ్ కుమార్ సిన్హా జూన్ 4న జిల్లాలో పర్యటించి, బలగాల మోహరింపును సమీక్షించారు.

# అష్టదరిద్రులు అడ్డం పడ్డా అభివృద్ధి ఆగదు

మొదటిపేజీ తరువాయి

పండ్లు, కూరగాయలు అన్నీ లభించేలా ఈ మార్కెట్‌ను నిర్మిస్తున్నాం అన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. తాగేందుకు నీళ్లు ఉండవు.. కూర్చునేందుకు స్థలం ఉండదు. అందుకే అన్ని వసతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులు నిర్మిస్తున్నాం. అంతర్జాతీయ సదుపాయాలు కల్పించుకుంటేనే.. మనది అంతర్జాతీయ నగరం అవుతుంది. ఎవరెంత ఏడ్చినా.. ఆర్‌ఆర్‌ఆర్ ఆగదు. అభివృద్ధి కూడా ఆగదు. వ్యవసాయం దండగ కాదు.. పండగ అని నిరూపిస్తున్నాం. కాళేశ్వరం కూలేశ్వరం అయినా.. దేశంలోనే అత్యధిక వరి పండిస్తున్నాం. వరి వేస్తే.. ఉరే అని చెప్పిన రోజులు కావు ఇవి. వరి రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నాం అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధికి అష్టదరిద్రులు అడ్డం పడుతున్నారని ధ్వజమెత్తారు. కాళ్లలో కట్టెలు పెట్టినా.. మూసీలో పడి దొర్లినా వాళ్లను పట్టించుకోమని విమర్శించారు. అసూయ పడేవాళు ,, అజీర్ణం చేసుకునేవాళ్లు ఎప్పుడూ ఉంటారని ఎద్దేవా చేశారు. రూ.2,284 కోట్లతో 239 ఎకరాల్లో ఫ్రూట్ మార్కెట్ నిర్మిస్తున్నారు. చుక్కనీరు ఎత్తిపోయకుండా లక్షల మెట్రిక్ టన్నుల పంట పండలేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడ నీళ్లున్నా కాళేశ్వరం నీళ్లు అనేవారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరాన్ని రూ.లక్ష కోట్లు వెచ్చిస్తే గోదావరి పాలయ్యాయని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో విధ్వంసం చేస్తే.. మేం వికాసం వైపు నడిపిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు అసూయ, పగ తమపై చూపండని.. కానీ ప్రజలపై కాదని చెప్పారు. సమస్యలు వస్తే పారిపోమని.. నిలబడి కొట్లాడి పరిష్కరించుకుంటామని అన్నారు. ఫామ్‌హౌస్ కేడీతోనైనా, ఢిల్లీలో మోదీతోనైనా కొట్లాడేందుకు సిద్ధమని వ్యాఖ్యానించారు. చేతకాకపోతే దిగిపొమ్మంటున్నారని.. తాము అల్లాటప్పాగా రాలేదని చెప్పారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సంగతి చెబుతామని హెచ్చరించారు. మర్యాద తప్పితే.. పొలిమేరలు కూడా దాటనివ్వమని వార్నింగ్ ఇచ్చారు. మోదీని చూపి భయపెట్టాలనుకుంటే.. ఇక్కడెవరూ భయపడేవారు లేరని చెప్పుకొచ్చారు ఈనెల 15 తర్వాత వడ్లు కొనకపోతే కేంద్రం సంగతి చూస్తామని హెచ్చరించారు. మాకు మాటలే కాదని.. చేతలు కూడా తెలుసునని అన్నారు. కేంద్రం నుంచి నిధులు ఎలా తెచ్చుకోవాలో తమకు తెలుసునని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.హైదరాబాద్ నగరం వేగంగా విస్తరిస్తోందని వ్యాఖ్యానించారు. భూముల ధరలు బాగా పెరిగాయని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ పెరగడంతో వ్యవసాయం కుంటుపడిందని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో 1.34 కోట్ల మంది నివసిస్తున్నారని తెలిపారు.ఒకప్పుడు హైదరాబాద్ చుట్టూ కూరగాయలు పండేవని వెల్లడించారు. గడ్డిఅన్నారం నుంచి ఫ్రూట్ మార్కెట్‌ని ఇక్కడికి తరలించారని ప్రస్తావించారు. రేకుల షెడ్లు వేస్తే.. అవి గాలి దుమారానికి ఎగిరిపోయాయని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ నిర్మిస్తామని హామీ ఇచ్చామని చెప్పారు. పండ్ల మార్కెట్ కోసం మనం చేసిన ప్రయత్నాన్ని అడ్డుకోవాలని చూశారని ధ్వజమెత్తారు. అందరి అవసరాలు తీర్చేలా మార్కెట్ నిర్మాణం చేయబోతున్నామని స్పష్టం చేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌తో ఏటా రూ.8 వేల కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. మన ప్రాంతంలో రైతులు అన్ని రకాల పండ్లు పండించాలని ఆకాంక్షించారు. ఫార్మా సిటీ వద్దని ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేయబోతున్నామని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయి కంపెనీలను ఇక్కడికి తీసుకురాబోతున్నామని వివరించారు. కాలుష్యం లేని పరిశ్రమలే ఈ ప్రాంతానికి వస్తాయని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ, మార్కెట్, ఆర్‌ఆర్‌ఆర్ వద్దంటూ అడ్డం పడుతున్నారని చెప్పుకొచ్చారు. వరంగల్ ఎయిర్‌పోర్టు వద్దని అడ్డుకుంటోందని ఆగ్రహించారు. గతంలో కావాలని మనం పోరాడితే.. ఇప్పుడు అష్టదరిద్రులు అడ్డం పడుతున్నారని దుయ్యబట్టారు. అభివృద్ధి చేద్దామంటే అడ్డుపడుతున్నారు.. ధర్నాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. 2034 వరకు ప్రజాపాలన ఉంటుందని స్పష్టం చేశారు. ఔర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్.. తమ నినాదమని ఉద్ఘాటించారు. అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకెళ్తామని చెప్పుకొచ్చారు. ఎంతమంది అడ్డం పడినా అభివృద్ధి పనులు ఆగవని తేల్చిచెప్పారు. సదుపాయాలు ఉంటేనే అంతర్జాతీయ స్థాయి నగరం అవుతుందని తెలిపారు. 'కారు' పూర్తిగా చెడిపోయి కార్ఖానాలో ఉంది. ఎన్ని మరమ్మతులు చేసినా.. చెడిపోయిన ఆ కారు ఇక పనికిరాదు. కేసీఆర్ కుర్చీ వేసుకొని కూర్చొని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మిస్తానని చెప్పారు. కానీ.. గెలిచిన తర్వాత పట్టించుకోలేదు. మేం అభివృద్ధి చేస్తుంటే.. అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామని బీఆర్ఎస్ చెబుతోంది. కాలుష్యం వెదజల్లే ఫార్మాసిటీ వద్దని.. ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 500 కంపెనీలు తీసుకురావాలని యత్నిస్తున్నాం. బీఆర్ఎస్ నేతలు దశాబ్దంలోనే శతాబ్దానికి సరిపడా విధ్వంసం చేశారు. తెలంగాణలో పండిన ధాన్యాన్ని కొనలేని మోదీ గద్దె దిగాలి. రాహుల్ గాంధీని ప్రధాని చేసి.. మొత్తం ధాన్యాన్ని కేంద్రంతో కొనిపిస్తా. పాలమూరు- రంగారెడ్డికి జాతీయ హోదా తెస్తా. మెట్రో విస్తరణకు, ఆర్‌ఆర్‌ఆర్‌కు వెంటనే నిధులు తీసుకొస్తా అని సీఎం అన్నారు.

# ప్రభుత్వ భూములను పెద్దలకు దోచిపెడుతున్న రేవంత్

మొదటిపేజీ తరువాయి

శ్రీ ఆదిత్య కంపెనీకి బీఆర్ఎస్ హయాంలోనే పర్మిషన్ ఇచ్చారని.. దాన్ని ముట్టుకునే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి నీళ్లపై అవగాహన లేదని కవిత విమర్శించారు. మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే ఏపీ సీఎం ఇవ్వరా? అని ప్రశ్నించారు. ఏపీ సీఎంతో మాట్లాడి 200 టీఎంసీల నీళ్లు తెచ్చి ఆ తర్వాత బనకచర్ల గురించి మాట్లాడాలన్నారు. అప్పుడు కేటీఆర్ పాలన నడిచిందని.. ఇప్పుడు కూడా కేటీఆర్ పాలనే నడుస్తోందన్నారు. అప్పుడు కేటీఆర్ అంటే కేసీఆర్, తన్నీరు హరీష్ రావు, రామారావు.. ఇప్పుడు కేటీఆర్ అంటే కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీజేపీ పరస్పర సవాళ్లతో ఒరిగేదేమీ లేదని కవిత విమర్శించారు. తెలంగాణ బరాబర్ ప్రజల జాగీరే అని.. పవన్ కల్యాణ్ జాగీర్ కాదని కవిత స్పష్టం చేశారు. ఆంధ్రా విషకోరల నుంచి తెలంగాణను కాపాడుకున్నామన్నారు. ఇక్కడకు వచ్చి రాజకీయం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పవన్‌కు మద్దతు ఇస్తే నాలుగు ఓట్లు వస్తాయని బీజేపీ భావిస్తోందని.. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఉన్న 8 సీట్లు పోతాయన్నారు. పవన్ కల్యాణ్ 10 ఎకరాలు శిఖం భూమిని కొనుగోలు చేశారని.. కోడికుంట సర్వే నంబర్ 706లో శిఖం భూమి ఉందన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో అనేక తప్పులు జరిగాయని.. ఆ భూమిని పవన్ తిరిగి ఇచ్చేయాలన్నారు. శిఖం భూమిలో వేసిన కంచెను పవన్ తొలగించాలని కవిత డిమాండ్ చేశారు.

# నగరంలో చల్లబడ్డ వాతావరణం

## పలు ప్రాంతాల్లో ఆకస్మిక వర్షం

**హైదరాబాద్,జూన్6నేషనలిస్ట్ వాయిస్ (న్యూస్ ప్రతినిధి) :**

హైదరాబాద్ నగరంలో శనివారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం నుంచి ఉక్కపోతతో ఇబ్బందిపడ్డ నగరవాసులకు భారీ వర్షం ఉపశమనం కలిగించింది. నగరంలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడగా, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. పంజాగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఐటీ కారిడార్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అలాగే ఖైరతాబాద్, కోఠి, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్ ప్రాంతాల్లోనూ మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదైంది. ఉప్పల్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, నిజాంపేట, శంషాబాద్, రాజేంద్రనగర్, గోల్కొండ ప్రాంతాల్లో కూడా వర్షం కురవడంతో నగరమంతా తడిసిముద్దయ్యింది. వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. రహదారులపై వాహనాలు నెమ్మదిగా కదిలాయి. ముఖ్యంగా ఐటీ కారిడార్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, పంజాగుట్ట, బంజారాహిల్స్ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో వర్షం పడటంతో ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో ద్విచక్ర వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు వాహనదారులు అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని సూచించారు.ఇక వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం.. హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో మరికొన్ని గంటల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని, నీటిమునిగిన రహదారులపై ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. మరోవైపు, వర్షంతో నగరంలో ఉష్ణోగ్రతలు తగ్గి ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. హైదరాబాద్‌లో కురిసిన ఈ వర్షం వేసవి వేడిమి నుంచి నగరవాసులకు తాత్కాలిక ఉపశమనం కలిగించింది.

# మర్పల్లి హోటల్ భవనం పైకప్పు కూలిన ఘటనపై మంత్రి దామోదర్ రాజనర్సింహ విచారం

**గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు మంత్రి ఆదేశం**

**మర్పల్లి ప్రమాద బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన మంత్రి దామోదర్**

**సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు ప్రత్యేక వైద్యం**

**ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల వివరాలు తెలుసుకున్న మంత్రి**

**సంగారెడ్డి, తెలంగాణ నేషనలిస్ట్ వాయిస్ (న్యూస్ ప్రతినిధి) :**

వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన హోటల్ భవనం పైకప్పు కూలిన ఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో నలుగురు గాయపడగా, వారిలో ఇద్దరు సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో, మరో ఇద్దరు స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ప్రమాదం జరిగిన వెంటనే బాధితుల ఆరోగ్య పరిస్థితిపై మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. అవసరమైన అన్ని వైద్య పరీక్షలు నిర్వహించి, ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో చికిత్స అందించాలని సూచించారు.అదేవిధంగా ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో ఇద్దరు బాధితుల ఆరోగ్య పరిస్థితిపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డిఎంహెచ్ వో) ద్వారా వివరాలు తెలుసుకున్నారు. వారి చికిత్సలో ఎలాంటి లోపాలు లేకుండా అవసరమైన సహకారం అందించాలని అధికారులను కోరారు.ప్రమాదంలో గాయపడిన వారందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. బాధితులు త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్య సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.కాగా, మర్పల్లి మండల కేంద్రంలోని ఓ హోటల్ భవనం పైకప్పు ఆకస్మికంగా



కూలిపోవడంతో అక్కడ ఉన్న నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు, అధికారులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించారు. ప్రస్తుతం గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఘటనకు గల కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు.

# వర్షాకాలం వస్తోంది జాగ్రత్త

## ముందస్తు చర్యలకు సిద్ధం కండి

**ధాన్యం కొనుగోళ్లు, సిఎం పర్యటనలపై జాగ్రత్తలు**

**కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎస్ ఆదేశాలు**

**హైదరాబాద్,జూన్6నేషనలిస్ట్ వాయిస్ (న్యూస్ ప్రతినిధి) :**

తెలంగాణలో వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాని, ముందస్తు చర్యలకు దిగాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాల పరిస్థితులు, వరి కొనుగోళ్లు, ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. శనివారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో వర్షాల ప్రభావంపై ప్రత్యేకంగా చర్చించిన సీఎస్, అన్ని జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించేలా అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వరి కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని జిల్లా యంత్రాంగానికి సీఎస్ సూచించారు. వర్షాల పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల హెచ్చరికలు, వరి కొనుగోళ్లు, సీఎం పర్యటనల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. రైతులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపైనా సీఎస్ అధికారులతో చర్చించారు. సీఎం పర్యటనలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లు, ప్రజాసభల నిర్వహణ, రవాణా సౌకర్యాలు, వసతి ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

మొదటిపేజీ తరువాయి

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ నిరసనలకు నాయకత్వం వహించగా, ప్రముఖ విద్యావేత్త, యాక్టివిస్ట్ సోనమ్ వాంగ్‌చుక్, పార్టీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇది సుదీర్ఘ పోరాటమని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ ఆరంభం మాత్రమేనని సీజేపీ స్పష్టం చేసింది. సీజేపీ మద్దతుదారులను ఉద్దేశించి అభిజీత్ దీప్కే మాట్లాడుతూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంత వరకూ నిరసనలు కొనసాగుతాయని ప్రకటించారు. ఇంకెంతమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునేంత వరకూ అధికారులు వేచిచూస్తారని నిలదీశారు. తమ డిమాండ్ల నెరవేరేంత వరకూ ఈ ఉద్యమం కొనసాగుతుందన్నారు. నిరసనలకు దిగితే జైలులో పెడతారేమోనని తన తల్లి భయపడినట్టు దీప్కే చెప్పారు. 'తమ పిల్లలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పితే ఏమవుతుందోనన్న భయం ఈ దేశంలోని ప్రతి తల్లికి ఉంది. ఈ ప్రభుత్వానికి భయపడి ఎంతకాలం బతకాలని ఆయన ప్రశ్నించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని నెలరోజుల నుంచి డిమాండ్ చేస్తున్నప్పటికీ చర్చలు తీసుకోవడం లేదని, దీనికి బదులు ఇతర అంశాలపైనే వాళ్లు దృష్టి పెట్టారని అన్నారు. సీజేపీ అకౌంట్లు హ్యాక్ చేయడం, పోస్టులు డిలీట్ చేయడం చేస్తున్నారని చెప్పారు. పోస్టులను డీలీట్ చేయవచ్చు కానీ, తమను ఏమార్చలేరని అన్నారు. పేపర్ లీక్‌లు, విద్యావ్యవస్థలో తప్పిదాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల పేర్లను ఆయన చదవి వినిపించారు. విద్యార్థుల మృతికి సీజేపీ సంతాపం ప్రకటించింది. జంతర్‌మంతర్ నిరసనల్లో పాల్గొనేందుకు ఆయన అమెరికాలోని బోస్టన్ నుంచి ఢిల్లీకి వచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను చేత్తో పట్టుకుని కనిపించారు. జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ విద్యాశాఖ మంత్రిగా ఆయన ఉండాలని కోరారు. అయితే తనకు రాజకీయాల్లో ప్రవేశించాలనే ఆలోచన లేదని వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. యువకులే ఆ బాధ్యత చేపట్టాలన్నారు. రాజకీయవేత్తలు, ప్రభుత్వ అధికారుల పిల్లలు ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చదవాలని తాను కోరుకుంటు న్నట్టు చెప్పారు. సీజేపీ నిరసనలకు ప్రభుత్వం అనుమతించడాన్ని ఆయన స్వాగతించారు. నిరసన తెలపడం తనకు ఇష్టం లేకున్నా న్యాయం కోసమే ఆ పని చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న విద్యావ్యవస్థలో మార్పు జరగాలని అన్నారు. కాగా, తదుపరి నిరసన ప్రదర్శనను జూన్ 23న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించే ఆలోచనలో సీజేపీ ఉంది. ఈ కార్యక్రమంలో వందలాదిమంది యువత పాల్గొని కాక్రోజ్ జనతాపార్టీకి మద్దుతగా నిలిచారు.

# నీట్-2026 పరీక్ష ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలి

## రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు






**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 06 (నేషనలిస్ట్ వాయిస్):**

రాష్ట్రంలో నీట్-2026 పరీక్ష ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. శనివారం హైదరాబాద్ నుండి అదనపు డిజిపి మహేష్ భగవత్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సిపిలు, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నీట్-2026 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు, వరి ధాన్యం కొనుగోలు, జూన్ 9న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి సభ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 21వ తేదీన జరగనున్న నీట్-2026 పరీక్షకు 24 పట్టణాలలో 208 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 72 వేల 956 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఇందుకు తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయాలని, రాష్ట్ర, జిల్లా సమన్వయ కమిటీలు అందుకు అనుగుణంగా పని చేయాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులపై తక్షణమే స్పందించాలని, వదంతులు వ్యాప్తి కాకుండా చూడాలని తెలిపారు. ప్రభుత్వ సంస్థలలో మాత్రమే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, అంతర్జాతీయ యోగా దినోత్సవం దృష్ట్యా పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. పరీక్ష రోజున ప్రశ్న పత్రాల తరలింపు, అభ్యర్థుల రిజిస్ట్రేషన్, బయోమెట్రిక్ వెరిఫికేషన్, అభ్యర్థుల తనిఖీ, బందోబస్తు తదితర ఏర్పాట్లను ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 71 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి 4 వేల 488 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 10 లక్షల 58 వేల మంది రైతుల ఖాతాలలో 13 వేల 577 కోట్ల రూపాయల కనీస మద్దతు ధర జమ చేయడం జరిగిందని, మిగిలిన ధాన్యాన్ని కూడా త్వరితగతిన కొనుగోలు చేసి కొనుగోలు ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి మండల మహిళా సమాఖ్యకు 1 చొప్పున 553 బస్సులను మంజూరు చేయడం జరిగిందని, ఈ బస్సులను జూన్ 9వ తేదీన సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా మహిళా సమాఖ్య సభ్యులకు లాంఛనంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లు, సభకు మహిళా సమాఖ్య సభ్యుల తరలింపుపై ఆయా జిల్లాల గ్రామీణ అభివృద్ధి అధికారులు, ఆర్టిసి రీజినల్ మేనేజర్లు సమన్వయంతో పని చేసి సభను విజయవంతం చేయాలని తెలిపారు. జూన్ 12న రాష్ట్రంలోని పాఠశాలల పునః ప్రారంభానికి విద్యార్థులకు అందజేయవలసిన యూనిఫామ్ లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. అదనపు డిజిపి మాట్లాడుతూ, పరీక్షా కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలకు ఎప్పటికప్పుడు స్పందించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మహిళా అభ్యర్థుల తనిఖీలో మహిళ కానిస్టేబుల్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, జిల్లాలో 1 వేయి 204 మంది అభ్యర్థులు నీట్-2026 పరీక్షకు హాజరు కానున్నారని, పరీక్ష నిర్వహణ కొరకు జిల్లాలో 5 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకొని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వర్షాల దృష్ట్యా కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచడం జరిగిందని, రవాణా సంబంధిత ఏర్పాట్లు చేయడం జరిగిందని, తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపి భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాశాఖాధికారి లలిత, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసుకుందాం

-మౌలిక సదుపాయాల కల్పనకు పాలకవర్గం నిరంతరం కృషిచేయాలి

-సిబ్బంది కొరతను తీర్చేవిధంగా నియమాకాలు చేపట్టండి

-సమిష్టి నిర్ణయాలతో సమస్యలు లేని కార్పొరేషన్‌గా నగరాన్ని తీర్చిదిద్దుదాం

-కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు

**భద్రాద్రి కొత్తగూడెం,జూన్6(నేషనలిస్ట్ వాయిస్):**

ప్రణాళికాబద్ధంగా కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసుకోవాలని ప్రతి డివిజన్‌లోనూ ప్రజల అవసరాలను గుర్తించి ముందుకు సాగాలని సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ కౌన్సిల్ సమావేశం మేయర్ మూడ్ గణేష్ అధ్యక్షతన శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశానికి కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. నగర పరిధిలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులను ప్రజాప్రతినిధులను ఆదేశించారు. ప్రధానంగా ఎండకాలం దృష్ట్యా త్రాగునీటి సమస్య పరిస్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య తీవ్రంగా వున్నచోట ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలనీ ప్రజల కనీస మౌలిక సదుపాయాల కల్పనకు పాలకవర్గం నిరంతరం కృషి చేయాలనీ సూచించారు. నీటి పథకంకు సంబంధించిన పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పనులు పూర్తయితే కార్పొరేషన్లో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిస్కారం లభిస్తుందన్నారు. ప్రస్తుతం కార్పొరేషన్లో సిబ్బంది కొరత వేధిస్తోందని త్వరలోనే ఉన్నతాధికారులతో మాట్లాడి అదనపు సిబ్బందిని పెంచేలా చూస్తామన్నారు. విద్యుత్ పారిశుద్ధ్యం అంతర్గత రోడ్లు మురుగు కాలువల డ్రైన్లు తదితర దీర్ఘకాలిక సమస్యల పరిస్కారంపై తాము ఇప్పటికే ప్రేత్యేక దృష్టి సారించామని స్పష్టం చేశారు. ఎలాంటి సమస్యలు లేని ఆదర్శ కార్పొరేషన్ గా కొత్తగూడెం కార్పొరేషన్ ను తీర్చిదిద్దేందుకు అందరం కలిసికట్టుగా శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కార్పొరేషన్ అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి వున్నానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.



# మహిళల భద్రత ప్రధాన లక్ష్యం

## మహిళ పోలీస్ అధికారిణి చల్లా అరుణ

**భద్రాద్రి కొత్తగూడెం,జూన్6(నేషనలిస్ట్ వాయిస్):**


మహిళల భద్రత ప్రధాన లక్ష్యమని మహిళా పోలీస్ అధికారిణి చల్లా అరుణ అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సుజాతనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగభూపాలెం, పాత అంజనాపురం, కొత్త అంజనాపురం, కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 4 ఇంక్లైన్, 3 ఇంక్లైన్, ప్రశాంతినగర్, జూలూరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో గల గుండెపూడి, ఏదుల్ల బయ్యారం పోలీస్ స్టేషన్ పరిధిలో గల సింగిరెడ్డిపల్లి, పాత రెడ్డిపాలెం మణుగూరు మునిసిపాలిటీ, భద్రాచలం గ్రామ పంచాయతీలలో గ్రామ సభలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజలకు మహిళల భద్రత, మహిళలు చిన్నారులపై జరిగే నేరాలు, మహిళలకు సంబంధించిన చట్టాలు సెక్షన్లు మహిళల సంక్షేమ పథకాలు పోక్సో చట్టం షీ బాక్స్ వినియోగం టి సేఫ్ వినియోగం షీ టీమ్స్ భరోసా సెంటర్లో పాత్ర బాల్య వివాహాల నివారణ సైబర్ నేరాలు పట్ల రోడ్డు భద్రత మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించడం జరిగింది.అత్యవసర పరిస్థితిలలో చేయవలసిన టోల్ ఫ్రీ నెంబర్లు మహిళా భద్రత విభాగం హెల్ప్ లైన్ నెంబర్ 181, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, అత్యవసర సేవల నెంబర్ 112 లపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు సిబ్బంది గ్రామపంచాయతీ కార్యదర్శులు సర్పంచులు అంగన్వాడి ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఐటిఐ లలో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానం

## ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ జి దేవానంద్

**మందమర్రి, జూన్ 06 (నేషనలిస్ట్ వాయిస్):**



పట్టణంలోని ఐటిఐ కళాశాలలో 2026 - 27 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ ప్రైవేటు ఐటిఐ లలో అడ్మిషన్ల కొరకు నోటిఫికేషన్ విడుదల అయినట్లు ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ జి దేవానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజనీరింగ్ నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్ ల లో ప్రవేశాల కోసం జూన్ 25 నుండి ఆన్ లైన్ లో వంద రూపాయల ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఐటిఐ లో కోర్సులు ఎలక్ట్రిషన్, ఫీట్టర్ డీజిల్ మెకానిక్, డ్రాట్స్ మెయిన్ సివిల్, మ్యాన్ ఫ్యాక్చరింగ్ ప్రాసెస్, ఆటో మిషిన్, ఇండస్ట్రియల్ రోబోటిక్, బేసిక్ డిజైనర్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్, వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎస్ఎస్సి, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, క్యాస్ట్ సర్టిఫికెట్, ధ్రువ పత్రాలు ఫోన్ నెంబర్ మెయిల్ ఐడి లలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# తూప్రాన్ మున్సిపల్ లో వార్డు సభలు నిర్వహణ

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారుల కృషి

**తూప్రాన్, జూన్ 6. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పట్టణ ప్రగతి -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వార్డు సభలను నిర్వహించాలనే ఆదేశాల మేరకు శనివారం తూప్రాన్ మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో సభలు నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కె. రమేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన వార్డు సభల్లో ప్రజల నుంచి సమస్యలు, అవసరాలు, అభివృద్ధి పనులకు సంబంధించిన వినతులను స్వీకరించారు. స్థానిక స్థాయిలో పరిష్కారం కావాల్సిన అంశాలపై అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ సమావేశాల్లో గౌరవ వార్డు కౌన్సిలర్లు, వార్డు ప్రత్యేక అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వార్డుల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు, పారిశు ద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ తదితర అంశాలపై చర్చించారు. ప్రజల సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.



# విద్యార్థులు సాంస్కృతిక పోటీల్లో రాణించాలి

## జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్

**భద్రాద్రి కొత్తగూడెం,జూన్6(నేషనలిస్ట్ వాయిస్):**

ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు పుస్తకాల పురుగులుగా మారుతున్నారని అలా కాకుండా సాంస్కృతిక పోటీల్లో క్రీడల్లో రాణించినప్పుడే వారు మానసిక ఉల్లాసంగా ఉంటారని జై భీమ్ రావ్ భారత్ పార్టీ(జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ న్యాయవాది యెర్రా కామేష్ అన్నారు. కొత్తగూడెం క్లబ్ లో రైసింగ్ స్టార్ డాన్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి సూపర్ డాన్స్ సీజన్-3 పోటీలకు ముఖ్యఅతిథిగా కామేష్ హాజరై డాన్స్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. అనంతరం కామేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ఉదయం నుంచి రాత్రి వరకు కేవలం పుస్తకాలకే పరిమితం చేస్తున్నారని ఇలా చేయడం వల్ల వారిలో దాగి ఉన్న కళలను బయటకు తీయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అలా కాకుండా ప్రతీ ఒక్కరిలో అంతర్లీనంగా ప్రతిభ దాగి ఉంటుందని ఆ ప్రతిభను గుర్తించి వారికి తగిన శిక్షణను ఇస్తే అద్భుతాలు సృష్టించవచ్చునని అన్నారు. డాన్స్ పోటీలకు విచ్చేసిన చిన్నారులను చూస్తుంటే ముచ్చటేస్తుందన్నారు. ఎలాంటి బెరుకు లేకుండా చిన్నారులు అద్భుతంగా తమ నృత్యాన్ని ప్రదర్శించారని కొనియాడారు. కొత్తగూడెం కళాకారులు జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. సూపర్ డ్యాన్సర్ 2వ సిరీస్ వల్లే 3వ సిరీస్ పోటీలు చాలా చక్కగా నిర్వహించిన డాన్స్ మాస్టర్స్ కనకం ప్రవీణ్ కుమార్, సందెబోయిన సంపత్ కుమార్ లను ప్రత్యేకంగా అభినందించారు. న్యాయనిర్ణేతలుగా హైదరాబాద్ దీపక్, రచ్చ మధు, భద్రాచలం శ్యామ్ లు వ్యవహరించారు. ఈకార్యక్రమంలో యామిని ఆసుపత్రి వైద్యులు యామిని కుమారి, నరసింహ సంజీవ్ రావు, మాజీ కౌన్సిలర్ రుక్మెంధర్ బండారి, కొప్పుల యశ్వంత్, సహస్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**చేగుంట జూన్ 6( నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్)**

చేగుంట మండలం బోనాల కొండాపూర్ శనివారం సర్పంచ్ రాజిరెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి సంక్షేమం కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని సభలో తీర్మానించారు, ప్రజలు రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించాలని కోరారు, వ్యవసాయంలో అధిక దిగుబడుల సాధనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమంలో కార్యదర్శి కల్పన, ఏ ఈ ఓ రేణుక కానిస్టేబుల్ రాజు పాల్గొన్నారు



# పారదర్శకంగా ఉద్యమకారులను గుర్తించాలి...

## ఉద్యమకారుల ఫోరం నాయకులు కొండారపు బ్రదర్స్.

**దామరచర్ల నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి జూన్ 6.**

తొలి దశ మలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన గ్రామాలలోని ఉద్యమకారులను పారదర్శకంగా గుర్తించాలని ఉద్యమ రుల ఫోరం నాయకులు కొండారపు బ్రదర్స్ నాగేశ్వరరావు, శ్రీను అన్నారు. 1969, 2009 నుండి 2014 వరకు జరిగిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను పారదర్శకంగా గుర్తించాలని ఉద్యమకారుల ఫోరం నాయకులు కొండారపు బ్రదర్ ఆధ్వర్యంలో దామరచర్ల తాసిల్దార్ కి వినతి పత్రం అందించారు. అంతకుముందు దామరచర్ల కార్యదర్శి కి మరియు ఇతర ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంలో 1200 మంది అమరులు కాగా ఉద్యమకారులు ఆర్థికంగా సామాజికంగా ఎంతో నష్టపోయారని తెలిపా రు. కావున ప్రస్తుత రాష్ట్రం ఉద్యమకారులను గుర్తిస్తామని వారికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గ్రామాల్లోని నిజంగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించే విషయంలో గ్రామంలోనే ప్రజల అభిప్రాయం తీసుకొని ఉద్యమకారులను పారదర్శకంగా గుర్తించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జానయ్య శారద ఉద్యమకారులు తదితరులు ఉన్నారు.




# పరిగిలో చిన్నపాటి వర్షానికే జలమయమైన ప్రధాన రోడ్డు.

## రాకపోకలకు అంతరాయం ఇబ్బంది పడ్డ వాహనదారులు, ప్రయాణికులు

**పరిగి (నేషనలిస్ట్ వాయిస్, ప్రతినిధి) జూన్ 06**

పరిగి పట్టణంలో శనివారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికే ప్రధాన రోడ్డు జలమయం అయ్యాయి. విజేత హాస్పటల్ సమీపంలో హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారిపైకి భారీగా వర్షం నీరు రావడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల రోడ్లపై నీరు నిలవడంతో కొంతసేపు ట్రాఫిక్ అంతరాయం కలిగింది. వర్షం నీరు నిలువకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్లపైన వర్షపు నీరు నిలువ కుండా చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ వర్షపు నీరు ప్రధాన రోడ్ల పైన నిలిచిందని దీంతో తమ బైకు సగం వరకు పూర్తిగా మునిగిపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడమంటూ మాల్లేమాన్ గూడ గ్రామానికి చెందిన బంధయ్య అనే వాహనదారుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే స్పందించి చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.





# గ్రామ సభల ద్వారా సమస్యల పరిష్కారానికి చర్యలు

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య






**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 06 (నేషనలిస్ట్ వాయిస్):**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక గ్రామ సభల ద్వారా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య తెలిపారు. శనివారం జిల్లాలోని బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచ్ జరుపుల సాయికిరణ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ప్రత్యేక అధికారి వేదాల శ్రీనివాస్, తాళ్ల గురజాల ఎ ఎస్ఐ బాబాజీ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక గ్రామసభల ద్వారా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వర్షాకాల సన్నద్ధత, సురక్షిత త్రాగునీరు, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ – మన సంరక్షణ, మొక్కల పెంపకం – వన మహోత్సవం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, వరద నిర్వహణ – భద్రత అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో మురుగు కాలువ నిర్మాణం, అంగన్వాడీ పాఠశాల నిర్మాణం కోసం కావలసిన భూమి, చెరువు వద్ద తూముల మరమ్మత్తు, ప్రమాదకరంగా ఉన్న వంగిన, విరిగిన విద్యుత్ స్తంభాలు, వ్రేలాడే, తెగిన విద్యుత్ తీగలు ఇతర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నీటి వృథాను అరికట్టి, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తూ ప్రతి పౌరుడు సామాజిక బాధ్యత కలిగి ఉండాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు నిబంధనలు పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఖాతా లలో నగదు చోరీకి గురైన వెంటనే 1930 నెంబర్ కి కాల్ చేసి సమాచారం అందించేలా ప్రజలకు వివరించాలని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని బంగారు మైసమ్మ ఆలయం సమీపంలో నిర్మాణాధినంగా ఉన్న నూతన ఈఎల్ఎస్ఆర్, నీటి శు ద్ధి కేంద్రాన్ని అధికారులతో కలిసి సందర్శించారు. బెల్లంపల్లి ప్రాంత ప్రజలకు మంచినీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచడం కోసం అమృత్ 2.0 పథకం క్రింద 63 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. పథకం కార్యాచరణ వేగవంతం చేసి పనులు త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ ఆర్ రాజ నరేందర్, ఎఈఓ గౌసియా బేగం, పంచాయతీ కార్యదర్శి స్నిగ్ధ, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బంది, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటాయపల్లి లో సర్పంచ్ హరీష్ గౌడ్ అధ్యక్షతన గ్రామసభ

## అభివృద్ధి, పరిశుభ్రతపై అధికారుల దృష్టి





**తూప్రాన్, జూన్ 6. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

మెదక్ జిల్లా తూప్రాన్ మండలం వెంకటాయపల్లి గ్రామంలో శనివారం గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామసభను సర్పంచ్ హరీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సంరక్షణ, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం తదితర అంశాలపై గ్రామస్తులతో చర్చించి అవగాహన కల్పించారు. ఈ గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరైన తూప్రాన్ తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామాన్ని పరిశు భ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయాలని సూచించారు. పరిశు భ్రమైన వాతావరణం వల్ల ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని, వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని వివరించారు. భూగర్భ జలాల పరిరక్షణ నేటి అవసరమని పేర్కొంటూ ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాల మట్టం పెరుగు తుందని, భవిష్యత్తులో నీటి కొరత సమస్యను అధిగమించవచ్చని తెలిపారు.అదేవిధంగా బహిరంగ మలవిసర్జన పూర్తిగా మానుకోవాలని, గ్రామంలో ప్రతి కుటుంబం స్వీయ మరుగుదొడ్లు నిర్మించుకొని వాటిని వినియోగించుకోవాలని కోరారు. పరిశుభ్రమైన గ్రామం నిర్మాణానికి ప్రజల సహకారం అత్యంత అవసరమని అన్నారు. గ్రామంలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై కూడా అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు.గ్రామ ప్రజలు తమ సమస్యలు, అవసరాలను గ్రామసభలో అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్, గ్రామ సెక్రటరీ కళ్యాణి, మండల స్థాయి అధికారులు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాల కోసం టవర్ ఎక్కిన తండ్రి

**చేగుంట జూన్ 06 (నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్ )**

చేగుంట మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన మారబోయిన నర్సింలు (55)మాజీ ఉపసర్పంచ్ 2015 సంవత్సరంలో తమ గ్రామ శివారులో ఉన్న ఎంఎస్ఎన్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ మరణించారు. అప్పటినుండి తనకు న్యాయం జరిగే లేదని, తన కొడుకు, కోడలికి, ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని, అలాగే తన గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని మొండికేసి కూర్చున్నారు. విషయం తెలుసుకున్న చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి, రామాయంపేట్ ఫైర్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. వారితో మాట్లాడగా తనకు న్యాయం జరిగే వరకు దిగినని మొండికేసి కూర్చున్నారు.



# బిజెపి జిల్లా కన్వీనర్ ప్రహ్లాద్ రావు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కె ఎస్ ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్ రెడ్డి

**(కుల్కచర్ల : నేషనలిస్ట్ వాయిస్ : జూన్: 7)**

శనివారము కులకచర్ల మండల కేంద్రము లోని వివేకానంద కళాశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన భారతీయ జనతా పార్టీ వికారాబాద్ జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లాద్ రావు జన్మదిన వేడుకల్లో కె ఎస్ ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్ రెడ్డి పాల్గొని పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేక్ కట్ చేసి ప్రహ్లాద్ రావుకు తినిపించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పరిగి నియోజకవర్గ కార్యకర్తలు మరియు నాయకులు పాల్గొన్నారు.



# "బొగ్గుల కుంట మాయం.. మొద్దు నిద్రలో ప్రభుత్వం..

తూప్రాన్, జూన్ 6. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చట్టాలు కఠినంగా ఉన్నా, భూబకాసురుల ఆగడాలకు మాత్రం అడ్డుకట్ట పడటం లేదు. చెరువులు, కుంటలు, శిఖం భూములు, ప్రభుత్వ స్థలాలు వరుసగా కబ్జాకు గురవుతున్నా సంబంధిత శాఖలు చూస్తూ ఊరుకోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపూర్ పిటి శివారులో ఉన్న 12 ఎకరాల బొగ్గుల కుంటను పూర్తిగా మాయం చేసి, అదే స్థలంలో విలాసవంతమైన నిర్మాణాలు చేపట్టడం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రెవెన్యూ రికార్డులు, గ్రామ నక్షాల్లో ఇప్పటికీ చెరువుగా నమోదై ఉన్న బొగ్గులకుంట క్షేత్రస్థాయిలో మాత్రం ఆనవాళ్లే లేకుండా పోయింది. ఒకప్పుడు 70 ఎకరాల ఆయకట్టుకు నీరందించిన ఈ జలాశయాన్ని పూడ్చివేసి, చెరువు కట్టను భారీ యంత్రాలతో ధ్వంసం చేసి, అక్కడే స్విమ్మింగ్ పూల్ నిర్మించడం పర్యావరణ వేత్తలను ఆందోళనకు గురిచేస్తోంది.

స్థానికుల ఆరోపణల ప్రకారం, కొందరు ప్రభావశీల రియల్టర్లు, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు కుమ్మక్కై ఈ భూ దందాకు పాల్పడ్డారని తెలుస్తోంది. కట్టను రెండు ముక్కలు చేసి భారీ గేట్లు ఏర్పాటు చేయడం, శిఖం భూములను చదును చేయడం, ప్రహరీ గోడలతో చుట్టుముట్టడం వంటి చర్యలు అధికారుల కళ్లముందే జరిగాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కోట్ల విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూమిని రెండు దశాబ్దాలుగా రాజకీయ అండదండలతో ఆక్రమించి సాగు చేస్తున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

"ప్రభుత్వ భూములపై భూబకాసురుల రాజ్యం!"

-12 ఎకరాల బొగ్గులకుంట మాయం..

-కోట్ల రూపాయల ప్రభుత్వ భూముల కబ్జా

-రాజకీయ అండదండలతో అక్రమాలకు రెక్కలు..

-అధికారులు మౌనంగా ఎందుకు?

-జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని ప్రజల డిమాండ్

-"బొగ్గుల కుంటను మింగేసిన భూబకాసురులు..

-కోట్ల ప్రభుత్వ భూములపై కన్నేసిన కబ్జాదారులు!"

-భూదందా వెనుక ఎవరి అండ?"

- ప్రభుత్వ భూముల కబ్జాపై ప్రజల ఆగ్రహం"

-"12 ఎకరాల బొగ్గుల కుంట గల్లంతు.. అధికారుల మౌనం వెనుక మర్మమేంటి






వెంకటాపూర్ పిటి లో కబ్జాకు గురైన బొగ్గుల కుంట

**మామూళ్ల మత్తులో అధికార యంత్రాంగమా?**

చెరువులు మాయమవుతున్నా... ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా.. .రెవెన్యూ, ఇరిగేషన్, స్థానిక సంస్థల అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కోట్ల రూపాయల విలువైన భూములు అక్రమంగా ఆక్రమించబడుతున్నా చర్యలు లేకపోవడం వెనుక భారీగా ముడుపులు చేతులు మారాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కలెక్టర్ ప్రత్యేక విచారణకు డిమాండ్

బొగ్గులకుంట ప్రభుత్వ భూముల వ్యవహారాలపై జిల్లా కలెక్టర్ స్వయంగా ప్రత్యేక బృందంతో విచారణ జరిపించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత సర్వే నంబర్ల రికార్డులు, గ్రామ నక్షాలు, ఉపగ్రహ చిత్రాల ఆధారంగా సమగ్ర సర్వే నిర్వహించి ఆక్రమణలను తొలగించాలని కోరుతున్నారు.

**"చెరువులు కాపాడకపోతే భవిష్యత్తులో నీటి సంక్షోభం తప్పదు"**

ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు ప్రజల ఆస్తి. వాటిని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. భూ బకాసురుల చెర నుంచి ప్రభుత్వ ఆస్తులను విముక్తి చేసి, చెరువులకు పూర్వ వైభవం తీసుకురాకపోతే రానున్న రోజుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పాటు గ్రామీణ వ్యవసాయం తీవ్రంగా దెబ్బతింటుందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు.?"

# సర్దార్‌నగర్ గ్రామంలో మెగా ఉచిత వైద్య శిబిరం

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి 6జూన్ (నేషనలిస్ట్ వాయిస్ )

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సర్దార్‌నగర్ గ్రామంలో నిర్వహించిన పట్నం మహేందర్ రెడ్డి ఆసుపత్రి వారి ఉచిత వైద్య శిబిరంలోశనివారం రోజున గ్రామ ప్రజల విశేష స్పందనతో ఎంతో విజయవంతంగా జరిగింది.మొత్తం 285 మంది గ్రామస్తులు వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందారు,వైద్య పరీక్షల్లో అవసరమని గుర్తించిన 44 మంది రోగులను మరింత వైద్య పరీక్షల కోసం డా. పట్నం మహేందర్ రెడ్డి హాస్పిటల్ కు రిఫర్ చేయడం జరిగింది.వారందరికీ సౌకర్యార్థం సోమవారం రోజున హాస్పిటల్ తరపున ఉచిత బస్సు ఏర్పాటు చేసి బస్సు గ్రామానికి వచ్చి రోగులను హాస్పిటల్‌కు తీసుకెళ్లి, పరీక్షలు పూర్తయ్యాక తిరిగి గ్రామానికి తీసుకువస్తుంది.ఈ సేవలను అందించిన డా. పట్నం మహేందర్ రెడ్డి హాస్పిటల్ యాజమాన్యానికి, వైద్య బృందానికి మరియు సహకరించిన గ్రామ పెద్దలు, గ్రామ యువతి యువకులు,గ్రామ ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేసిన,సర్దార్ నగర్ గ్రామ సర్పంచ్ మామిడి కీర్తి హరీష్మరియు గ్రామపంచాయతీ పాలకవర్గం.ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయించిన సర్దార్ నగర్ గ్రామ సర్పంచ్ కీర్తిహరీష్ లకు అభినందనలు తెలుపుతూ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



# ఘనంగా బిజెపి జిల్లా కన్వీనర్ ప్రహ్లాద్ రావు జన్మదిన వేడుకలు

## హాజరైన దిశా కమిటీ అడ్వైజర్ మెంబర్ డాక్టర్ జానకిరామ్

( కుల్కచర్ల : నేషనలిస్ట్ వాయిస్ : జూన్ 7)

ఘనంగా బిజెపి జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లాద్ రావు జన్మదిన వేడుకలకు వివేకానంద జూనియర్ కళాశాల ప్రాంగణంలో భారీ ఏర్పాట్లను చేయడం జరిగిందని వికారాబాద్ జిల్లా దిశ అడ్వైజర్ కమిటీ మెంబర్ కుల్కచర్ల మాజీ సర్పంచ్ డాక్టర్ జానకిరామ్ అన్నారు. శనివారము కులక్చర్ల మండల కేంద్రం నందు వివేకానంద కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బిజెపి వికారాబాద్ జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లాద్ జన్మదిన వేడుకలకు జిల్లా దిశా అడ్వైజర్ కమిటీ మెంబర్ డాక్టర్ జానకి రామ్ హాజరై పూలమాల,శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి ప్రహ్లాద్ రావుకు తినిపించారు. ఈ సందర్భంగా జానకిరామ్ మాట్లాడుతూ ప్రహ్లాద్ రావు జన్మదినం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రుల చికిత్స పొందుతున్న రోగులకు కార్యకర్తలతో కలిసి పండ్లను పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన మోర్చా నాయకులు గోవింద నాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్ నాయక్, మండలాధ్యక్షులు వెంకటేష్, బాలాజీ,రాజేందర్, గాదె మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.



# మహిళల, బాలల భద్రతను పటిష్టం చేయడంలో సురక్ష మిత్ర కార్యక్రమం ఒక మైలురాయిగా నిలుస్తుంది :

## జిల్లా కలెక్టర్ దీపక్ తివారి






పరిగి (నేషనలిస్ట్ వాయిస్, ప్రతినిధి) జూన్ 06

మహిళల, బాలల భద్రతను పటిష్టం చేయడంలో "సురక్ష మిత్ర" కార్యక్రమం ఒక మైలురాయిగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్‌కే కన్వెన్షన్ హాల్ లో 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" గ్రామ సభల కార్యక్రమంలో భాగంగా, ప్రజల రక్షణ కోసం సమాజ భాగస్వామ్యంతో పనిచేయాలనే లక్ష్యంతో మహిళలు, పిల్లల రక్షణార్థం వికారాబాద్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా సురక్ష మిత్ర అనే వినూత్న ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ.. ప్రభుత్వ యంత్రాంగం ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ప్రజల క్రియాశీలక భాగస్వామ్యం ఉన్నప్పుడే ఆశించిన మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలు, భద్రతా వ్యవస్థలను మరింత చేరువ చేయడంలో ఈ వాలంటీర్ల వ్యవస్థ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. జిల్లా ఎస్పీ శ స్నేహ మెహ్రా మాట్లాడుతూ...జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామం, ప్రతి వార్డులో సురక్ష మిత్రలను ఏర్పాటు చేసి ప్రజా భాగస్వామ్యంతో కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. గ్రామ సభలు, అవగాహన కార్యక్రమాలు, పాఠశాలలు, కళాశాలలు మరియు ప్రజా సమావేశాల ద్వారా మహిళల భద్రత, బాల్య వివాహాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన, మాదకద్రవ్యాల నిర్మూలన, అనుమానాస్పద కార్యకలాపాల సమాచారాన్ని పోలీసులకు చేరవేయడం వంటి అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే ప్రతి గ్రామం మరియు వార్డు స్థాయిలో ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి ప్రజల సమస్యలపై తక్షణ స్పందన అందించేలా సమర్థవంతమైన సమాచార వ్యవస్థను రూపొందించినట్లు తెలిపారు. సురక్ష మిత్ర లోగోలోని చేతులు సమాజ బాధ్యతను, షీల్డ్ రక్షణను, తల్లి–బిడ్డల ప్రతిరూపం మహిళలు మరియు చిన్నారుల సంక్షేమాన్ని, తరంగాలు అప్రమత్తతను సూచిస్తాయని వివరించారు.

సురక్ష మిత్ర వాలంటీర్లు ఉన్న వారికి శిక్షణ కార్యక్రమం కూడా ఏర్పాటు చెయ్యడం జరుగుతుందని ఆమె తెలిపారు. పరిగి శాసనసభ్యులు రామ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు, చిన్నారుల భద్రతను మరింత పటిష్టం చేయడానికి పోలీసు శాఖతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ మరియు మారుమూల ప్రాంతాలు అధికంగా ఉన్న వికారాబాద్ జిల్లాలో కేవలం పోలీసుల నిఘా మాత్రమే కాకుండా ప్రజల సహకారం కూడా లభిస్తే నేరాల నియంత్రణలో విశేష ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు.సమాజంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువజన ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, బాధ్యతగల పౌరులను 'సురక్ష మిత్ర' వాలంటీర్లుగా ఎంపిక చేసి పోలీసులకు సహకరించే విధంగా కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. పోలీసులకు, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తూ మహిళల భద్రత, బాలల రక్షణ, బాల్య వివాహాల నిరోధం, మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం, మహిళలపై వేధింపులను అరికట్టడం వంటి అంశాలలో కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తమంగా పనిచేసే సురక్ష మిత్ర వాలంటీర్లను జిల్లా స్థాయిలో ప్రత్యేక అవార్డులు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు.

ముందుగా ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించడంతో పాటు, ఈ వినూత్న కార్యక్రమానికి సంబంధించిన అధికారిక సురక్ష మిత్ర లోగోను ప్రముఖులు ఘనంగా ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో డి.పి.ఓ జయసుధ, ఎస్.డి.పి.ఓ శ్రీనివాస్, ఎంపీడీఓ హరిప్రియ రెడ్డి, తహసీల్దారు వెంకటేశ్వరి, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు, స్వచ్ఛంద కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సంజీవనరావుపేట గ్రామంలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం ఎస్సై శ్రీశైలం

నారాయణఖేడ్ (నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి) జూన్ 06

సంజీవనరావుపేట గ్రామంలో మహిళల భద్రత, చట్టపరమైన హక్కులు మరియు సైబర్ నేరాల నివారణపై నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్సై శ్రీశైలం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని, మహిళల రక్షణ కోసం ప్రభుత్వం మరియు పోలీసు శాఖ అనేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే సైబర్ మోసాలు, వేధింపులు, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, ప్రజాప్రతినిధులు మరియు పోలీస్ డిపార్ట్మెంట్, స్వరూప, జైపాల్ రెడ్డి, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సంజీవనరావుపేట గ్రామంలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం ఎస్సై శ్రీశైలం

**నారాయణఖేడ్ (నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి) జూన్ 06**


సంజీవనరావుపేట గ్రామంలో మహిళల భద్రత, చట్టపరమైన హక్కులు మరియు సైబర్ నేరాల నివారణపై నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్సై శ్రీశైలం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని, మహిళల రక్షణ కోసం ప్రభుత్వం మరియు పోలీసు శాఖ అనేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే సైబర్ మోసాలు, వేధింపులు, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, ప్రజాప్రతినిధులు మరియు  పోలీస్ డిపార్ట్మెంట్, స్వరూప, జైపాల్ రెడ్డి, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థికంగా భరోసానూ కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు

## శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు





**చిన్న శంకరంపేట జూన్ 6,( నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి )**

చిన్న శంకరంపేట మండలంలోని రాదేశాం ఫంక్షన్ హాల్‌లో మండలంలోని లబ్ధిదారులకు మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మొత్తం ౮115 మంది లబ్ధిదారులకు రూ.1,05,12,480 కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్వయంగా వారి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ, "రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రతిష్టాత్మకంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోంది. అని అన్నారు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం అందేలా చర్యలు చేపడుతున్నామని వారు అన్నారు లబ్ధిదారులందరూ ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హలవత్ మోహన్ నాయక్. మాజీ మండల అధ్యక్షుడు సాన సత్యనారాయణ చిన్న శంకరంపేట సర్పంచ్ కంచర్ల చంద్రశేఖర్ మాజీ సర్పంచ్ రాజిరెడ్డి మెదక్ జిల్లా సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు గోపాల్ రెడ్డి పోతురాజు రమణ శంభుని శివకుమార్ మండల తహసిల్దార్ మాలతి ఆర్.ఐ రాజు వివిధ గ్రామాల సర్పం చులు ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులను పట్టించుకోని కొడుకులకు బుద్ధి

## - సొంతింటిని వృద్దులకు అప్పగించిన అధికారులు

**మిర్యాలగూడ,జూన్6 (నేషనలిస్ట్ వాయిస్)**

వృద్ధ తల్లిదండ్రులను దూరం కొట్టిన కొడుకులకు కలెక్టర్ గట్టి బుద్ధి చెప్పారు. వారి ఇంటిని వారికి స్వాధీనం చేయించారు. వివరాల్లోకి వెళితే..నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో గల హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన ఇంజం చంద్రకళ భర్త రమణారెడ్డి(70) వయోవృద్ధులు. వీరికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉంది. వారి విద్యాభ్యాసం, పెళ్లిళ్లు వంటి బాధ్యతలు అన్ని నిర్వర్తించడం జరిగింది. వీరికి సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం ఇంజంవారిగూడెంలో వ్యవసాయ భూమి, మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఓ ఇల్లు కలదు. వీరి పేరు మీద ఉన్నటువంటి ఇంటిలో కుమారుడు గత ఐదేండ్లుగా నివాసం ఉంటూ తల్లిదండ్రులను రానివ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. పక్షవాతం, మోకాళ్ల ఆపరేషన్, ఇతర అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న వయోవృద్ధులు ఆర్డీఓ ట్రిబ్యునల్ అలాగే అప్పిలేట్ ట్రిబ్యునల్, సీనియర్ సిటిజెన్స్ చట్టాన్ని ఆశ్రయించడంతో వయోవృద్ధుల చట్టం 2007ను అనుసరించి జిల్లా కలెక్టర్ గత నెల 15వ తేదీన సదరు ఆస్తిని వారికి స్వాధీనపరచాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను అమలు పరచాల్సిందిగా ఆర్డీఓ ఎస్.రమణారెడ్డి వివిధ డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో జరపాలని గత 23వ తేదీ ఉత్తర్వులు ఇవ్వడంతో ఉత్తర్వుల అమలులో భాగంగా మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజా రెడ్డి, స్థానిక సీఐ నాగభూషణం, తాసీల్దార్ సిబ్బంది, రెవెన్యూ, మహిళా శిశు, దివ్యాంగుల వయో వృద్ధుల శాఖ అందరు కలిసి ఆ వయో వృద్ధులను శనివారం వారి ఇంటిలోకి చేర్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సైదులు, అనిల్ కుమార్, గోపమ్మ, మున్సిపల్ సిబ్బంది సాజిద్, సాంబయ్య, రెవెన్యూ శాఖ నుండి రాజు, ఆర్ఐ, సిడిపిఓ కార్యాలయం నుండి రాములు గారు నాగిరెడ్డి నవీన్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో పాలమూరుకు ద్రోహం

## - తెలంగాణ నీటిని ఎపికి దోచిపెట్టే కుట్ర

## - సగునీటి సలహారుగా ఆంధ్రాప్రాంత వ్యక్తి

## - మీడియా సమావేశంలో మాజీమంత్రి శ్రీనివాసగౌడ్

**మహబూబ్‌నగర్,జూన్6 (నేషనలిస్ట్ వాయిస్)**



కాంగ్రెస్ పాలనలో అన్ని జిల్లాల కంటే ఎక్కువ నష్టం మహబూబ్‌నగర్ కు జరిగిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ నీటిని ఆంధ్రాకు దోచిపెట్టే కుట్రలు జరుగుతున్నాయని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆంధ్రా వ్యక్తిని సాగునీటి సలహాదారుగా పెట్టి తెలంగాణకు అన్యాయం చేశారని మండిపడ్డారు. ఏపీకి నీళ్లు తీసుకుపోయి పాలమూరును ఎండబెడతారంట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే టెండర్లు పిలిచి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. నిన్న మంత్రి, ముఖ్యమంత్రి మాటలకు ప్రజల నుంచి స్పందన లేదని తెలిపారు. ఇప్పటికైనా చిల్లర మాటలను సీఎం రేవంత్ రెడ్డి మానుకోవాలని హితవుపలికారు. పాత చింతకాయ పచ్చడిలా రేవంత్ రెడ్డి ప్రసంగం ఉందని ఎద్దేవా చేశారు.మహబూబ్‌నగర్‌లో శనివారం ఉదయం మాజీ మంత్రి లక్ష్మారెడ్డితో కలిసి శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం పర్యటన గురించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ఆశతో ఎదురు చూశారని తెలిపారు. కానీ ఉమ్మడి జిల్లా ప్రజలకు సీఎం ఇచ్చింది ఏమీ లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి వచ్చి కేసీఆర్ కట్టిన పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్లను పరిశీలించిన వెళ్లారని తెలిపారు. కర్ణాటక జల దోపిడీకి మనం నిధులు ఇవ్వడమేంటని ఆయన ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్టును సీఎం ఎందుకు వ్యతిరేకించడం లేదని నిలదీశారు. ఇప్పటికే జూరాలకు చుక్కనీరు వస్తలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రాజెక్టులను పడావు పెడుతున్నదని విమర్శించారు. కర్ణాటకలో చర్చలు కొలిక్కి రాకుండానే బ్యారేజి కమ్ బరాజ్‌లపై ఎలా ఏరియల్ సర్వే చేశారని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు చంద్రబాబు ఎన్వోసీ ఇస్తే బనకచర్లపై సీఎం రేవంత్ రెడ్డి ఆలోచిస్తానని అంటున్నారని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తెలంగాణ జల హక్కులపై చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. మీరు తిరిగే రిజర్వాయర్‌లు కట్టింది కేసీఆర్ కాదా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టు నిర్మాణానికి తట్టెడు మట్టిని కూడా రేవంత్ ప్రభుత్వం తీయలేదని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును డిజైన్ చేసింది 45 కిలోమీటర్ల కాలువలు అని.. అందులో41 కిలోమీటర్ల కాలువలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని తెలిపారు. మొత్తం రూ.33,500కోట్ల పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన పనులను కాంగ్రెస్ చేసిందని చెప్పుకుంటారా అని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి పనుల జాప్యానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని అన్నారు.

# ఏపీ సీఎం చంద్రబాబుతో రేవంత్ రెడ్డి కుమ్మక్కయ్యారు: హరీశ్ రావు

## - సాగునీటి ప్రాజెక్టులపై తమను విమర్శించే హక్కు రేవంత్ కు లేదన్న హరీశ్

## - కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరుకు చేసిందేమీ లేదని వ్యాఖ్య

## - ఈ ఏడాది 75 శాతం కృష్ణా నీటిని ఏపీ వాడుకుందని ఆరోపణ

**(నేషనలిస్ట్ వాయిస్)**



పాలమూరు ప్రాజెక్టు సందర్శనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విమర్శలకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు గట్టి కౌంటర్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డివి "మతిలేని మాటలు" అంటూ ఆయన తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు.నేడు ఓ న్యూస్ ఛానల్‌తో మాట్లాడిన హరీశ్ రావు...బీఆర్ఎస్ చేపట్టబోయే పాదయాత్ర భయంతోనే సీఎం రేవంత్ రెడ్డికి నిద్ర కరువైందని, సాగునీటి ప్రాజెక్టులపై తమను విమర్శించే నైతిక హక్కు ఆయనకు లేదని స్పష్టం చేశారు. "అధికారంలోకి వచ్చి రెండున్న రేళ్లు దాటుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరుకు చేసిందేమీ లేదు. సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుతో కుమ్మక్కై తెలంగాణకు తీవ్ర ద్రోహం చేస్తున్నారు. అందుకే ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ 75 శాతం కృష్ణా నీటిని వాడుకుంటే, తెలంగాణ కేవలం 25 శాతానికే పరిమితమైంది" అని హరీశ్ రావు ఆరోపించారు.ఈ వైఫల్యానికి గానూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు పరిధిలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని గుర్తుచేశారు. పాలమూరు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా మోసం చేసిందని, రాబోయే రోజుల్లో కొడంగల్‌లో రేవంత్ రెడ్డిని మళ్లీ ఓడించి, పాలమూరు గడ్డపై గులాబీ జెండా ఎగరేస్తామని హరీశ్ రావు ధీమా వ్యక్తం చేశారు.

# గండిపేట భూకబ్జా కేసు

## - వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లాకు 14 రోజుల రిమాండ్

## - చంచల్‌గూడ జైలుకు తరలించిన పోలీసులు

**హైదరాబాద్,జూన్6 (నేషనలిస్ట్ వాయిస్)**

గండిపేట భూకబ్జా కేసులో అరెస్టైన వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు ఉప్పరపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఆయనను చంచల్‌గూడా జైలుకు తరలించారు. ఈ కేసు తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, భూకబ్జా కేసులో నిందితుడిగా ఉన్న బొల్లా బ్రహ్మనాయుడిని సైబరాబాద్ పోలీసులు తమిళనాడులోని కాంచీపురంలో అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనను రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్‌కు తీసుకువచ్చి నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో భాగంగా స్టేట్‌మెంట్ నమోదు చేసిన అధికారులు, ఆ తర్వాత న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. బొల్లా బ్రహ్మనాయుడిని నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తీసుకువస్తున్నారనే సమాచారం అందడంతో వైసీపీ కార్యకర్తలు, ఆయన అనుచరులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా పోలీస్ స్టేషన్‌లోకి ఎవరినీ అనుమతించ లేదు. దీంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నార్సింగి పోలీస్ స్టేషన్ నుంచి బొల్లా బ్రహ్మనాయుడిని కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉప్పరపల్లి కోర్టుకు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వాదనలు విన్న కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం చంచల్‌గూడా జైలుకు పంపించారు. గండిపేట భూకబ్జా కేసులో ఇప్పటికే ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. బొల్లా బ్రహ్మనాయుడు అరెస్టుతో మొత్తం అరెస్టుల సంఖ్య ఆరుకు చేరాయి. ఈ కేసులో మరికొంతమందిని కూడా విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భూకబ్జాకు సంబంధించిన పలు కోణాల్లో సైబరాబాద్ పోలీసులు విచారణ చేపట్టారు. భూముల ఆక్రమణ, పత్రాల వ్యవహారం, సంబంధిత వ్యక్తుల పాత్ర వంటి అంశాలపై అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా మరిన్ని చర్యలు చేపట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. గండిపేట భూకబ్జా కేసులో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడి అరెస్ట్, అనంతరం కోర్టు రిమాండ్ విధించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# నగరంలో చల్లబడ్డ వాతావరణం పలు ప్రాంతాల్లో ఆకస్మిక వర్షం

**హైదరాబాద్,జూన్6 (నేషనలిస్ట్ వాయిస్)**

హైదరాబాద్ నగరంలో  శనివారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం నుంచి ఉక్కపోతతో ఇబ్బందిపడ్డ నగరవాసులకు భారీ వర్షం ఉపశమనం కలిగించింది. నగరంలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడగా, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. పంజాగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఐటీ కారిడార్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అలాగే ఖైరతాబాద్, కోఠి, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్ ప్రాంతాల్లోనూ మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదైంది. ఉప్పల్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, నిజాంపేట, శంషాబాద్, రాజేంద్రనగర్, గోల్కొండ ప్రాంతాల్లో కూడా వర్షం కురవడంతో నగరమంతా తడిసిముద్దయ్యింది. వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. రహదారులపై వాహనాలు నెమ్మదిగా కదిలాయి. ముఖ్యంగా ఐటీ కారిడార్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, పంజాగుట్ట, బంజారాహిల్స్ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో వర్షం పడటంతో ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో ద్విచక్ర వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు వాహనదారులు అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని సూచించారు.ఇక వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం.. హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో మరికొన్ని గంటల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని, నీటమునిగిన రహదారులపై ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. మరోవైపు, వర్షంతో నగరంలో ఉష్ణోగ్రతలు తగ్గి ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. హైదరాబాద్‌లో కురిసిన ఈ వర్షం వేసవి వేడిమి నుంచి నగరవాసులకు తాత్కాలిక ఉపశమనం కలిగించింది.

# రెండున్నరేళ్లుగా తట్టెడు మట్టి తీయలేదు

## - ఇప్పుడేమో హడావిడి చేస్తే ఎలా నమ్మాలి
## - ససిఎం తీరుపై మండిపడ్డ మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

మహబూబ్‌నగర్,జూన్6 (నేషనలిస్ట్ వాయిస్)

రెండున్నరేళ్లయినా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో తట్టటెడు మట్టి తీయలేదని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి విమర్శించారు. ఇప్పుడు పూర్తి చేస్తామని అంటే ఎలా నమ్ముతారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాదయాత్ర చేస్తానని అంటేనే కాంగ్రెస్ ప్రభుత్వం కదిలిందని అన్నారు. ఇప్పుడు అకస్మా?త్తుగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కార్‌కు ప్రేమ పుట్టిందని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ రెండున్నరేళ్లపాటు పాలమూరు-రంగారెడ్డిని పడావు పెట్టిందని మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్ రెడ్డితో కలిసి లక్ష్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డికి రేవంత్ రెడ్డి సర్కార్ ఏం చేసిందని ఆయన ప్రశ్నించారు. ప్రాజెక్టులు పూర్తి చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. రైతులకు నీళ్లు ఇవ్వలేనే సోయి లేదని అన్నారు. 10 శాతం ప్రాజెక్టును పూర్తి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఏడాది సమయం కావాలని అంటుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ పూర్తి కాలేదని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడని తెలిపారు. రేవంత్ రెడ్డి పచ్చి అబద్దాలు చెబుతున్నాడని మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌ను కాంగ్రెస్ సర్వనాశనం చేసిందని లక్ష్మారెడ్డి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే మహబూబ్‌నగర్ అభివృద్ధి జరిగిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఉత్తమ్ మాటలు అన్ని ఉత్తవే అని ఎద్దేవా చేశారు. పాలమూరు జిల్లా ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి మాటలపై నమ్మకం లేదని లక్ష్మారెడ్డి అన్నారు. పాలమూరు జిల్లా అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని స్పష్టంచేశారు.

# రాజ్యసభకు లింగమనేని నామినేషన్

## కూటమి ఎమ్మెల్యేలు మద్దతుగా హాజరు
## స్వగ్రామంలో రమేశ్‌కు మద్దతుగా సంబరాలు

అమరావతి,జూన్6 (నేషనలిస్ట్ వాయిస్)

రాజ్యసభ అభ్యర్థిగా జనసేన తరఫున లింగమనేని రమేష్ అసెంబ్లీలో నామినేషన్ దాఖలు చేశారు. రమేష్ నామినేషన్ పై ఆరుగురు జనసేన ఎమ్మెల్యేలు, ముగ్గురు తెదేపా ఎమ్మెల్యేలు, ఒక భాజపా ఎమ్మెల్యే సంతకాలు చేశారు. రమేష్ వెంట మద్దతుగా కూటమి ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, బొలిశెట్టి శ్రీనివాస్ నాయకర్, వంశీకృష్ణ శ్రీనివాస్, దేవ వరప్రసాద్, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, కాగిత కృష్ణ ప్రసాద్, నక్కా ఆనంద్ బాబు, ఎన్ ఈశ్వర రావు (బీజేపీ) వెళ్లారు.జనసేన రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేశ్ నామినేషన్ దాఖలు చేశారు. రమేశ్ నామినేషన్‌ను 10 మంది కూటమి ఎమ్మెల్యేలు ప్రతిపాదించారు. రమేష్ నామినేషన్‌పై ఆరుగురు జనసేన ఎమ్మెల్యేలు, ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలు, ఒక బీజేపీ ఎమ్మెల్యే సంతకాలు చేశారు. లింగమనేని వెంట మద్దతుగా కూటమి ఎమ్మెల్యేలు  వెళ్లారు. జనసేన అభ్యర్థిగా రాజ్యసభకు నామినేషన్ వేసినట్లు రమేశ్ తెలిపారు. తనకు అవకాశం కల్పించిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. తన అభ్యర్థిత్వాన్ని బలపరిచిన ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు లింగమనేని రమేశ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నిక అయ్యాక అందరితో మరోసారి మాట్లాడుతానని రమేశ్ వెల్లడించారు. ఇదిలావుంటే లింగమనేని రమేశ్ రాజ్యసభకు ఎంపికవడంపై స్వగ్రామం మొవ్వ మండలం పెద్ద ముత్తెవిలో సంబరాలు అంబరాన్నంటాయి. రమేశ్.. గ్రామస్థాయి నుంచి రాజ్యసభ వరకు ఎదిగారని గ్రామస్థులు తెలిపారు. పెదముత్తేవి శ్రీలక్ష్మీపతి స్వామి ఆలయంలో రమేశ్ విజయానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టుదలతో చిన్న వ్యాపారాల నుంచి రమేశ్ ఎదిగారని హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామలింగేశ్వరరావు అన్నారు. రమేశ్‌కు ఇంకా ఉన్నత పదవులు రావాలని గ్రామస్థులు ఆకాంక్షించారు.



# నవజాత శిశువుల ఆరోగ్యం గుర్తింపు

## శిశుమాపన్ యాప్‌ను ప్రారంభించిన ప్రభుత్వం

### ఎఐతో అనుసంధానించినట్లు మంత్రి సత్యకుమార్ వెల్లడి

అమరావతి,జూన్6 (నేషనలిస్ట్ వాయిస్)

నవజాత శిశువుల ఆరోగ్య ప్రమాణాలను సులభంగా, ఖచ్చితంగా గుర్తించేందుకు ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత ఆధారంగా పనిచేసే 'శిశు మాపన్' యాప్‌ను ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. ఈ నూతన విధానం ద్వారా పుట్టిన పిల్లలను చేతులతో తాకాల్సిన అవసరం లేకుండానే.. కేవలం మొబైల్ వీడియో ద్వారా వారి ఆరోగ్య వివరాలను రికార్డు చేయవచ్చు.సాధారణంగా నవజాత శిశువుల బరువు, ఎత్తు, తల, ఛాతీ చుట్టుకొలతలను సాంప్రదాయ పద్ధతుల్లో కొలవడం కొంత శ్రమతో కూడుకున్న పని. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు గాను.. ప్రస్తుతం వినియోగంలో ఉన్న 'ఆశా' యాప్‌తో ఈ 'శిశు మాపన్' యాప్‌ను అనుసంధానించారు. ఈ సరికొత్త ప్రాజెక్ట్‌ను మంగళగిరి నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం లకు ఈ యాప్ వినియోగంపై ప్రత్యేక శిక్షణ కూడా పూర్తి చేశారు. మంగళగిరిలో సాధించే ఫలితాలు, క్షేత్రస్థాయి అనుభవాలను పరిశీలించిన అనంతరం ఈ అధునాతన ఏఐ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

## - ఇరాన్ డ్రోన్లను కూల్చిన అమెరికా సైన్యం
## - హర్మూజ్ జలసంధి వద్ద మళ్లీ ఉద్రిక్తతలు

టెహ్రాన్,జూన్6 (నేషనలిస్ట్ వాయిస్)

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మళ్లీ ముసురుతున్నాయి. హోర్ముజ్ జలసంధి లక్ష్యంగా ఇరాన్ ప్రయోగించిన నాలుగు డ్రోన్లను అమెరికా సైన్యం కూల్చివేసింది. దీనికి ప్రతీకారంగా, ఇరాన్ తీరప్రాంతంలోని నిఘా రాడార్ కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులకు దిగింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది.హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు ఇరాన్ డ్రోన్ల వల్ల తక్షణ ముప్పు పొంచి ఉందని అమెరికా సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. ఆత్మరక్షణ చర్యల్లో భాగంగానే జలసంధిలోని ఒక ద్వీపంతో పాటు ఇరాన్ తీరంలోని కీలక రాడార్ సైట్‌లపై తాము దాడులు చేసినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. మరోవైపు, ప్రపంచ ఇంధన సరఫరాకు గుండెకాయ లాంటి హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధించేందుకు ఇరాన్ ప్రయత్నిస్తుండగా, అందుకు ప్రతిగా అమెరికా ఇరాన్ రేవులపై ఆంక్షలు, దిగ్బంధనాన్ని విధిస్తోంది. ఈ వారంలోనే కువైట్ ప్రధాన విమానాశ్రయంలోని ప్యాసింజర్ టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరు మరణించగా, డజన్ల కొద్దీ ప్రయాణికులు గాయపడ్డారు. దీనివల్ల ఎయిర్‌ఫీల్డ్ తాత్కాలికంగా మూతపడింది. ఈ దాడితో తీవ్ర ఆగ్రహానికి గురైన అమెరికా, తాజా ఘర్షణతో ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు పంపింది. రాడార్ సైట్‌లపై దాడులతో పాటు, హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తున్న ఇరాన్ లింక్డ్ చమురు ట్యాంకర్‌ను అమెరికా సైన్యం తమ ఆధీనంలోకి తీసుకుంది. ఆంక్షల పరిధిలో ఉన్న చమురును విక్రయించడం ద్వారా ఇరాన్ లాభపడకుండా అడ్డుకునేందుకు అమెరికా ఈ చర్య చేపట్టింది. అలాగే, ఇరాన్ ఇంధన రంగానికి సహాయం చేస్తున్న పలువురు వ్యక్తులు, సంస్థలు, ట్యాంకర్లపై అమెరికా కొత్తగా మరికొన్ని ఆర్థిక ఆంక్షలను విధించింది. ఇరాన్-అమెరికా ఘర్షణ కేవలం జలసంధికే పరిమితం కాలేదు. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, లెబనాన్ ప్రభుత్వాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ మద్దతున్న హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థ తిరస్కరించింది. ఈ క్రమంలో శుక్రవారం ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ లెబనాన్‌లోని ఎక్కువ భాగాన్ని ఇజ్రాయెల్ ఇప్పటికే తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మరోవైపు, హోర్ముజ్ జలసంధి తెరవాలన్నా, శాశ్వత కాల్పుల విరమణ కుదరాలన్నా లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు ఆగాలని ఇరాన్ పట్టుబడుతోంది.

# దేశ ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిన బిజెపి

## - కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లో దేశ సంపద
## - దిగజారుతున్న పేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలు
## - కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా 9న సిపిఎం దేశవ్యాప్త నిరసనలు

రాజమహేంద్రవరం,జూన్6 (నేషనలిస్ట్ వాయిస్)

దేశ ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారాలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిన పేపర్ లీకేజీలు, ప్రజా రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక హక్కులపై దాడులకు వ్యతిరేకంగా జూన్ 9న దేశవ్యాప్తంగా నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఎం తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన ఓ సమావేశం శనివారం సిపిఎం కార్యాలయంలో జువ్వల రాంబాబు అధ్యక్షతన జరిగింది.ముఖ్య అతిథి గా పాల్గొన్న వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేసిందన్నారు. సంపద కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లో కేంద్రీకృతమవుతుండగా, పేదలు మరియు మధ్యతరగతి ప్రజల జీవన పరిస్థితులు రోజురోజుకు దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో నిరుద్యోగం గతంలో ఎన్నడూ లేని స్థాయికి చేరుకుందని, కోట్లాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో బలహీనపరుస్తోందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను విపరీతంగా పెంచడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి ప్రజల జీవనం భారంగా మారిందన్నారు. రైతులకు పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని పేర్కొన్నారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని, వివిధ ప్రవేశ, ఉద్యోగ పరీక్షల్లో వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలు పరీక్షా వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీశాయని అన్నారు. లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాలపాటు శ్రమించి పరీక్షలకు సిద్ధమవుతుంటే, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వారి భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని, ఎనిమిది గంటల పని విధానాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. కార్మికులు సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి విస్తృత ఐక్య పోరాటాలు అవసరమని అన్నారు.ప్రజల జీవన సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజలను విభజించే రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ప్రజల అసలు సమస్యలైన ఉపాధి, విద్య, వైద్యం, ధరల నియంత్రణ వంటి అంశాలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి టి అరుణ్ మాట్లాడుతూ ధరల పెరుగుదల, నిరుద్యోగం, పేపర్ లీకేజీలు, కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రజా రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జూన్ 9న నిర్వహించే నిరసన కార్యక్రమాలలో ప్రజలు, యువత, విద్యార్థులు, కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆంధ్రా పేపర్ లిమిటెడ్ కడియం యూనిట్ లో యాజమాన్యం నిరంకుశ వైఖరి కారణంగా 1200 మంది పర్మినెంట్ కాంట్రాక్టు కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్య పరిష్కారం చేయాలని కోరారు. సమావేశం లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి పవన్, పి తులసి, జిల్లా కమిటీ సభ్యులు సుందర బాబు, పూర్ణిమ రాజ్, ఎస్ ఎస్ మూర్తి, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం

## - 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్
## - సంవృద్ధి కేంద్రాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి

గుంటూరు,జూన్6 (నేషనలిస్ట్ వాయిస్)



2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా ఉండాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.. భారత దేశం అభివృద్ధి చెందాలంటే గ్రామాలు అభివృద్ధి చెందాలన్నారు. గ్రామాల్లో డిజిటల్ సేవలు అందుబాటులోకి తెచ్చేలా సంవృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో సంవృద్ధి కేంద్రం ద్వారా పౌరసేవలు, డిజిటల్ సేవలను అందించనున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ఒక గ్రామం అభివృద్ధి చెందాలంటే వారికి అందిస్తున్న సేవలు ప్రజలకు చేరువులో ఉండాలని సూచించారు. శనివారం నాడు జిల్లాలోని చేబ్రోలు మండలం నారాకోడూరులో సంవృద్ధి కేంద్రాన్ని కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ప్రారంభించారు. 'కేంద్రం ఒక్కటి... సేవలు అనేకం' అనే నినాదంతో ప్రధాని నరేంద్ర మోదీ పని చేస్తున్నారని కేంద్ర మంత్రి తెలిపారు. సంవృద్ధి గ్రామ కేంద్రంగా నారాకోడూరు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసినట్లు చెప్పారు. గ్రామంలో ఎక్కడికీ వెళ్లకుండా ఈ కేంద్రంలో అన్ని సేవలు అందుతాయని అన్నారు. దాదాపుగా 60 టెస్టులు కేంద్రంలో పది నిమిషాల్లో చూస్తారన్నారు. డ్వాక్రా మహిళలకు ఎలా వ్యాపారం చేయాలో నేర్పిస్తారని అన్నారు. పోస్ట్ ఆఫీసు సేవలు ఉంటాయన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా విద్యార్థులకు కంప్యూటర్ నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. రైతుల ఆదాయం కోసం, భూమి సారం కోసం టెస్ట్‌లు చేస్తున్నారన్నారు. పంట పొలాలకు ఎరువు చల్లే విధంగా డ్రోన్ ఏర్పాటు చేశామన్నారు. నారాకోడూరు గ్రామంలో ఉన్న సంవృద్ధి కేంద్రం దేశంలో నంబర్ వన్‌గా నిలవాలని పెమ్మసాని చంద్రశేఖర్ ఆకాంక్షించారు. సంవృద్ధి గ్రామ కేంద్రాన్ని నారాకోడూరు గ్రామంలో పెట్టినందుకు కేంద్రానికి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ధన్యవాదాలు తెలియజేశారు. ఒక్క కేంద్రంలో అనేక సౌకర్యాలు ఉన్నాయన్నారు. నారాకోడూరు గ్రామంలో ఉన్న పిల్లలను రోజుకి గంట సమయం ఈ కేంద్రంలో గడిపేలా తల్లిదండ్రులు చూసుకోవాలని.. దీని ద్వారా వారి భవిష్యత్తు మెరుగుపడుతుందని వెల్లడించారు. నారాకోడూరు గ్రామంలో ప్రతి ఇంటికి వ్లైఫై సదుపాయం కల్పిస్తున్నారని అన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి పని చేస్తోందన్నారు. 'మీరు మాకు ఇచ్చిన అధికారాన్ని గ్రామాల అభివృద్ధి, సంక్షేమం కోసం పని చేస్తాం. మాకు కులం లేదు, మా కులం ప్రజలకు సేవ చేయడమే' అని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పేర్కొన్నారు.





# ఆపరేషన్ బ్లూ స్టార్ 42వ వార్షికోత్సవం

## - అకాల్ తఖ్త్ వద్ద ఖలిస్తాన్ అనుకూల నినాదాలు

చండీఘడ్,జూన్6 (నేషనలిస్ట్ వాయిస్)

పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఉన్న ప్రముఖ సిక్కు మత కేంద్రం అకాల్ తఖ్త్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఆపరేషన్ బ్లూ స్టార్ 42వ వార్షికోత్సవం సందర్భంగా ఖలిస్థాన్ అనుకూల నినాదాలు వినిపించాయి. సిక్కు మిలిటెంట్ నాయకుడు జర్నైల్ సింగ్ భింద్రాన్‌వాలే పోస్టర్లు వెలిశాయి. జూన్ 6, 1984న భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ బ్లూ స్టార్‌లో భింద్రన్‌వాలే మరణించారు.ప్రతి ఏటా జూన్ 6వ తేదీన సిక్కు సమాజంలోని కొన్ని వర్గాలు 'ఘల్లోఘూరా దివస్'గా పాటిస్తాయి. ఈ ఏడాది కూడా భింద్రన్ వాలేను స్మరించుకుంటూ కొందరు కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో శాంతి భద్రతలను కాపాడేందుకు పంజాబ్ పోలీసులు అమృత్‌సర్, దాని పరిసర ప్రాంతాలలో విస్తృతమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. శాంతిభద్రతల ప్రత్యేక డైరెక్టర్ జనరల్ ప్రవీణ్ కుమార్ సిన్హా జూన్ 4న జిల్లాలో పర్యటించి, బలగాల మోహరింపును సమీక్షించారు. దాదాపు 4,000 మంది పోలీసు సిబ్బందిని రక్షణ కార్యక్రమాల్లో భాగం చేశారు. కాగా, భింద్రన్‌వాలేను సిక్కు సమాజంలోని కొంతమంది అమరవీరుడిగా భావిస్తే, మరికొందరు ఆయనను పంజాబ్‌లో తీవ్రవాద ఉద్యమానికి ప్రతీకగా చూస్తారు.

# కరీంనగర్‌లో కూలిన లిఫ్ట్

## - ఎమ్మెల్యే కవ్వంపల్లికి తప్పిన ప్రాణాపాయం

కరీంనగర్,జూన్6 (నేషనలిస్ట్ వాయిస్)

మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు పెను ప్రమాదం తప్పింది. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు కరీంనగర్‌కు ఎమ్మెల్యే వెళ్లారు. అయితే, కెమిస్ట్ భవన్ రెండో అంతస్తు నుంచి దిగుతూ లిఫ్ట్ ప్రమాదానికి గురైంది. సాంకేతిక కారణాల వల్ల లిఫ్ట్ ఒక్కసారిగా రెండో అంతస్తు నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు పడిపోయింది. ప్రమాద సమయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లితో పాటు లిఫ్ట్‌లో మరో ఆరుగురు ఉన్నారు. ఏం జరుగుతుందో అర్థం కాక వారంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సిబ్బంది వెంటనే స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడటంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు, ఎమ్మెల్యే కవ్వంపల్లి లిఫ్ట్ ప్రమాదానికి గురయ్యారని తెలుసుకున్న నియోజకవర్గ ప్రజలు, ఆయన అభిమానులు ఆందోళన చెందారు.

# పోలీసులకు లొంగిపోయిన సిఐ చినమల్లయ్య

పల్నాడు,జూన్6 (నేషనలిస్ట్ వాయిస్)

అత్యాచారం కేసులో గత కొన్ని వారాలుగా పరారీలో ఉన్న సీఐ చినమల్లయ్య ఎట్టకేలకు శనివారం తెల్లవారుజామున సుమారు 5 గంటల ప్రాంతంలో వినుకొండ పోలీస్ స్టేషన్‌కు వచ్చి అధికారుల ముందు లొంగిపోయారు. తనపై సీఐ చినమల్లయ్య అత్యాచారం చేశాడంటూ.. ఏప్రిల్ 29న ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనపై కేసు నమోదైంది. నాటి నుంచి అరెస్ట్ భయంతో అజ్ఞాతంలోకి వెళ్లిన చినమల్లయ్య, పోలీసులకు దొరకకుండా తప్పించుకుంటూనే ముందస్తు బెయిల్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారు. అయితే, ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లను అటు ఆంధ్రప్రదేశ్ హైకోర్టుతో పాటు, ఇటు దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు కూడా కొట్టివేయడంతో ఆయనకు చట్టపరంగా ఎలాంటి ఊరట లభించలేదు. అన్ని కోర్టుల్లోనూ పిటిషన్లు తిరస్కరణకు గురికావడంతో అరెస్ట్ తప్పదని భావించిన చినమల్లయ్య, చివరికి వినుకొండ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ప్రస్తుతం ఆయనను అదుపులోకి తీసుకున్న పోలీసులు తదుపరి విచారణ జరుపుతున్నారు.

# వశిష్ట గోదావరిలో పడి యువకుడు మృతి

భీమవరం,జూన్6 (నేషనలిస్ట్ వాయిస్)

పశ్చిమగోదావరి జిల్లా వశిష్ట గోదావరి నదిలో స్నానానికి దిగి ఓ యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. విషాద సంఘటన ఆచంట మండలంలో చోటు చేసుకుంది. పిప్పర గ్రామానికి చెందిన జక్కంశెట్టి భానుప్రసాద్ (18) అనే యువకుడు వల్లూరు పంచాయతీ గెద్దాడవారిపాలెం లోని తన అమ్మమ్మ ఇంట్లో ఉంటూ ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటున్నాడు. శుక్రవారం తన స్నేహితులతో కలిసి కరుగోరుమిల్లి పురస్కార రేవు వద్ద సరదాగా గోదావరిలో స్నానానికి దిగిన భానుప్రసాద్, అకస్మాత్తుగా కాలుజారి నీటిలో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు,, ÷ర్ సిబ్బంది గజఈతగాళ్లతో గాలించగా శుక్రవారం రాత్రికి భానుప్రసాద్ మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి గతంలోనే మరణించగా, తల్లి ఉపాధి కోసం విదేశాల్లో ఉంటోంది. కంటికి రెప్పలా చూసుకుంటున్న మనవడు కళ్లముందే అనంతలోకాలకు వెళ్లిపోవడంతో అమ్మమ్మ, తాతయ్యలతో పాటు బంధువులు, స్నేహితుల ఆర్తనాదాలు మిన్నంటాయి. ఆచంట ఎస్సై కే. వెంకటరమణ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# 208 పరీక్షా కేంద్రాల్లో నీట్ పరీక్ష

## సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలతో జాగ్రత్త

## జిల్లాల కలెక్టర్లకు సిఎస్ దిశానిర్దేశం

హైదరాబాద్,జూన్6 (నేషనలిస్ట్ వాయిస్)

జూన్ 21వ తేదీన జరగనున్న నీట్ పరీక్ష ఏర్పాట్లపై తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శనివారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 208 పరీక్షా కేంద్రాల్లో నీట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 24 నగరాల్లో 72,956 మంది విద్యార్థులు నీట్‌కు హాజరు కానున్నారని చెప్పుకొచ్చారు. పరీక్షా కేంద్రాల్లో భద్రత, విద్యుత్, తాగునీరు, రవాణా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సూచించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు దిశానిర్దేశర చేశారు.

# నాపై అసత్య ప్రచారం తగదు

## - కొవ్వూరి నాగేంద్ర రెడ్డి

తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 6 (నేషనలిస్ట్ వాయిస్)

తనపై అసత్య ప్రచారం జరుగుతుందని, అసలు ఏమీ లేని విషయాన్ని జరిగినట్టుగా కొన్ని టీవీ ఛానళ్ళు అసత్య ప్రచారం చేయటం తగదని తాడేపల్లిగూడెం రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొవ్వూరి నాగేంద్ర రెడ్డి అన్నారు. కొన్ని టీవీ ఛానళ్ల లో తాను దొంగ నోట్లు కేసులో అరెస్టయినట్లుగా అసత్య ప్రచారం చేయటం విచారకరమని, ఈ ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. స్థానిక పి అండ్ టి కాలనీలోని రెడ్డి సంక్షేమ సంఘం సీనియర్ నాయకుడు మేడపాటి చెల్లారెడ్డి నివాసంలో శనివారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. తాడేపల్లిగూడెం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ మీడియా సమావేశంలో నాగేంద్ర రెడ్డి మాట్లాడుతూ తాను 40 సంవత్సరాలుగా వ్యాపారం చేస్తున్నానని, తమ కుటుంబం గురించి తాడేపల్లిగూడెం ప్రజానీకానికి కొన్ని దశాబ్దాలుగా తెలుసని, అత్యంత నిజాయితీగా వ్యవహరించే తనపై ఇలాంటి అసత్య ప్రచారం జరగటం ఎంతో బాధాకరమని ఆయన ఆవేదనను వ్యక్తం చేశారు. తన సొంత పొలం అమ్మకం వ్యవహారంలో తాను కాకినాడ వెళ్లానని, అసలు దీనికి ఏ మాత్రం సంబంధం లేని దొంగ నోట్ల వ్యవహారం ఎలా వచ్చిందో అర్థం కావడం లేదని వాపోయారు. దీనిపై కాకినాడ పోలీసు అధికారులు పూర్తి వివరణ ఇచ్చారని తెలిపారు. ఎవరో ఇచ్చిన ఫేక్ కాల్ నిమిత్తం పోలీసులు తాము దిగిన లాడ్జికి వచ్చారని, పూర్తి విచారణ అనంతరం ఎలాంటి చట్ట



వ్యతిరేక వ్యవహారం జరగలేదని నిర్ధారించిన తరువాత పోలీసులు మీడియాకు తెలియజేశారన్నారు. ఈ విషయంలో ఎలాంటి ప్రాథమిక సమాచారం కాని, ఆధారాలు కానీ లేకుండా రెండు, మూడు చానళ్లలో తాను దొంగ నోట్లు కేసులో అరెస్టయినట్లుగా తనపై అసత్య ప్రచారం చేసి తన పరువుకి తీరని నష్టం కలిగించారని ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు మేడపాటి చెల్లారెడ్డి, ద్వారంపూడి వేణుగోపాల్ రెడ్డి, నల్లిమిల్లి గాంధీ రెడ్డి, నల్లిమిల్లి అంజిరెడ్డి, కొవ్వూరి లక్ష్మణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అన్నామలై బాటలో సుమతి వెంకటేశ్

## - బిజెపికి రాజీనామా చేసిన పార్టీ రాష్ట్రకార్యదర్శి

చెన్నై,జూన్6 (నేషనలిస్ట్ వాయిస్)

తమిళనాడు భారతీయ జనతా పార్టీలో సంక్షోభం మరింత ముదురుతోంది. మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కే. అన్నామలై, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరు నాగరాజన్ పార్టీని వీడిన కొన్ని రోజుల్లోనే, మరో కీలక నేత పార్టీకి గుడ్‌బై చెప్పారు. తమిళనాడు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సుమతి వెంకటేష్ తన పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘమైన భావోద్వేగ లేఖను పంచుకున్నారు. భారమైన హృదయంతో తప్పుకుంటున్నానని.. చాలా రోజులు ఆలోచించిన తర్వాతే తాను ఈ కఠినమైన నిర్ణయం తీసుకున్నట్లు సుమతి వెంకటేష్ తెలిపారు. తమిళనాడు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తూ, పార్టీతో తన అనుబంధాన్ని ముగిస్తున్నానని ఆమె తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ఈ పార్టీలో పనిచేయడం తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని కూడా సుమతి అన్నారు. అయితే, పార్టీ వీడినప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం, జాతీయవాదం, దేశభక్తి సిద్ధాంతాలు తనకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని సుమతి వెంకటేష్ స్పష్టం చేశారు. తన పదవీ కాలంలో సహకరించిన జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలకు, కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తమిళనాడులో బీజేపీని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లిన కె. అన్నామలై ఇటీవల పార్టీకి రాజీనామా చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. వంశపారంపర్య రాజకీయాలు, వ్యక్తిగత ఆరాధనలకు దూరంగా, సాధారణ ప్రజల రాజకీయం తీసుకురావడమే లక్ష్యంగా తాను సరికొత్త రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అన్నామలై దారిలోనే ఇప్పుడు మిగిలిన కీలక నేతలు కూడా నడుస్తుండటం తమిళనాడు రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# నార్సింగ్ స్టేషన్‌కు బొల్లా బ్రహ్మనాయుడు

## - కాంచీపురం నుంచి తరలించిన పోలీసులు

హైదరాబాద్,జూన్6 (నేషనలిస్ట్ వాయిస్)

గండిపేట భూకబ్జా కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిని సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో వైసిపి నేతలు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చారు. పరారీలో ఉన్న ఆయన్ను తమిళనాడులోని కాంచీపురం నుంచి నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాంచీపురం నుంచి రోడ్డు మార్గం గుండా నార్సింగికి పోలీసులు తీసుకొస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌లో స్టేట్‌మెంట్ రికార్డ్ చేసిన తర్వాత బ్రహ్మనాయుడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నారు. భూకబ్జా కేసులో ఇప్పటి వరకు ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. బ్రహ్మనాయుడి అరెస్ట్‌తో ఆ సంఖ్య ఆరుకు చేరింది. మాజీ ఎమ్మెల్యేను నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తీసుకువస్తున్నారన్న సమాచారంతో పీఎస్ వద్దకు పెద్ద సంఖ్యలో వినుకొండ వైసీపీ కార్యకర్తలు చేరుకున్నారు. శుక్రవారమే బ్రహ్మనాయుడిని కాంచీపురంలో అరెస్ట్ చేసిన పోలీసులు.. అక్కడ స్థానికంగా ఉన్న కోర్టులో ప్రవేశపెట్టిన అనంతరం నార్సింగి పీఎస్‌కు తరలించారు. గండిపేటలోని సర్వేనెంబర్ 18లో సుమారు వంద ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో తొమ్మిది ఎకరాలకు పైగా కాజేసేందుకు నిమ్మల కుటుంబసభ్యులు కుట్రపన్నారు. అందుకోసం నకిలీ జీవోలు, నకిలీ పత్రాలను సృష్టించడంలో మధ్యవర్తి రాధాకృష్ణకు బ్రహ్మనాయుడు సహకరించారని ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం రూ.12 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు సైబరాబాద్ పోలీసుల దర్యాప్తులో బయటపడింది. తహశీల్దార్ ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్, రాధాకృష్ణ, నిమ్మల కుటుంబ సభ్యులు కలిసి ఈ కుట్ర పన్నినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ఐదు మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు నమోదు విషయం తెలిసిన వెంటనే బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నారు. ఆయనపై సైబరాబాద్ పోలీసులు నిఘా ఉంచారు. కొంతకాలం బెంగళూరులో ఉన్న బ్రహ్మనాయుడు అక్కడి నుంచి కేరళకు వెళ్లి ఆపై తమిళనాడులోని కాంచీపురంకు వెళ్లారు. బ్రహ్మనాయుడు కాంచీపురంలో ఉన్నట్లు సమాచారం అందిన వెంటనే నార్సింగి పోలీసుల బృందం, ఈవోడబ్ల్యూకు సంబంధించిన మరో బృందం అక్కడకు చేరుకుని మాజీ ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకున్నారు.

# పక్షుల సంరక్షణపై బర్డ్ వాక్

## - పోచారం డిబిసిలో అదనపు కలెక్టర్ నగేశ్ ప్రారంభం

మెదక్,జూన్6 (నేషనలిస్ట్ వాయిస్)



ప్రకృతి పరిరక్షణ, పక్షుల సంరక్షణపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో బర్డ్ వాక్ కార్యక్రమం నిర్వహించినట్లు అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. శనివారం పోచారంలోని డీబీసీలో నిర్వహించిన బర్డ్ వాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అటవీ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.పోచారం ల్యాండ్‌స్కేప్‌లో గొప్ప పక్షి వైవిధ్యం, సహజ వారసత్వం ఉందని దీనిని కాపాడేందుకు బర్డ్ వాక్ నిర్వహించామన్నారు. పోచారం జలాశయం , అభయారణ్యం చుట్టూ ఉన్న పోచారం ప్రాంతం, వలస నీటి పక్షులు, కొంగలు, ఐబీస్‌లు, బాతులు అనేక అటవీ ప్రాంతాలతో సహా విభిన్న పక్షి జీవనానికి ప్రసిద్ధి చెందిందన్నారు. ఇది ఒక ముఖ్యమైన పక్షి వీక్షణ గమ్యస్థానంగా నిలుస్తుందనీ పేర్కొన్నారు. ప్రకృతి ప్రేమికులు, విద్యార్థులు, అధికారులు పాల్గొని వివిధ రకాల పక్షులను వీక్షించాలని కోరారు. పక్షుల జీవన విధానం, వలస పక్షుల ప్రాముఖ్యత, పర్యావరణ సమతుల్యతలో వాటి పాత్రను వివరించాలని సూచించారు. పక్షుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా చెట్లు నాటాలని, నీటి వనరులను కాపాడాలని, పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ జోజి , మెదక్ డీపీఆర్వో రామచంద్ర రాజు, ఎఫ్ఆర్వోలు , బీట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియను బీఎల్వోలు వేగవంతంగా పూర్తి చేయాలి

## - గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇన్చార్జి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 06 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

వరంగల్ తూర్పు నియోజక వర్గంలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ను బి ఎల్ వోలు మరింత వేగవంతంగా పూర్తిచేయాల ని హనుమకొండ జిల్లా కలెక్టర్ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇన్చార్జి కమిషనర్, చాహత్ బాజ్ పాయ్ అన్నారు.
శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నూతన బిఎల్వోల తో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై ఇన్చార్జి కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మకొండ జిల్లా కలెక్టర్, ఇన్చార్జి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఎన్నికల ప్రక్రియలో బూత్ లెవల్ అధికారుల (బీఎల్వో) పాత్ర అత్యంత కీలకమని పేర్కొంటూ, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నిబంధనలకు అనుగుణం గా, పారదర్శకంగా నిర్వహిం చాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతిరోజు ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో మెరుగైన పురోగతి ఉండాల ని బిఎల్వోలకు సూచించారు ఈ సందర్భంగా ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమానికి సంబంధించి న మార్గదర్శకాలు, ఇంటింటి ధృవీకరణ ప్రక్రియ, అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో నమోదు చేయడం, మరణిం చిన లేదా శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలను పరిశీలించడం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఎలాంటి పొరపాట్లు లేకుండా ఓటరు జాబితాల నవీకరణ చేపట్టాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులను పాటిస్తూ, ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నాయబ్ తహసిల్దార్ ఎండి సుభాన్, బి ఎల్ వో లు పాల్గొన్నారు.

# తల్లి, కూతురి ఘోర హత్య : కేసును ఛేదించిన ఏలూరు పోలీసులు


## - వ్యక్తిగత కక్షలు, నగలే కారణం.. ముగ్గురు నిందితుల అరెస్ట్

## - మద్యం లో మత్తుమందు ఇచ్చి తోటలోకి తీసుకెళ్లి ఘాతుకం

## - నిందితుల నుంచి బంగారం, వెండి ఆభరణాల స్వాధీనం







ఏలూరు జిల్లా జూన్ 06: (నేషనలిస్ట్ వాయిస్)

ఏలూరు జిల్లా చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర సంచలనం సృష్టించిన తల్లికూతుళ్ల జంట హత్యల కేసును ఏలూరు జిల్లా పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. ఈ దారుణానికి ఒడిగట్టిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు శనివారం వెల్లడించారు. అరెస్ట్ అయిన వారిలో పోనమాల శిరీష (ఏ1), కర్రి ప్రసాదు అలియాస్ బన్ను (ఏ2), ఆశు దుర్గ (ఏ3) ఉన్నారు.
పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం.. మృతులకు, నిందితులకు మధ్య ఉన్న వ్యక్తిగత కక్షలు, ఆర్థిక లావాదేవీలే ఈ హత్యలకు ప్రధాన కారణంగా తేలింది. నిందితులు ముగ్గురూ కలిసి ఒక పథకం ప్రకారం తల్లి, కూతురిని నమ్మబలికి సమీపంలోని జీడిమామిడి తోటకు తీసుకెళ్లారు. అక్కడ వారు తాగే మద్యంలో ముందస్తు ప్రణాళిక ప్రకారం మత్తు గుళికలు కలిపారు. బాధితులు స్పృహ కోల్పోగానే వారిపై ఘోరంగా దాడి చేసి హతమార్చారు. అనంతరం మృతదేహాలపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలను దొంగిలించి అక్కడి నుంచి పరారయ్యారు.

హత్య ఉదంతం వెలుగుచూడటంతో ఏలూరు జిల్లా పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందాలను రంగంలోకి దించారు. ఘటనా స్థల పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించడంతో పాటు, నిందితుల కాల్ డేటా రికార్డు విశ్లేషణ వంటి అత్యాధునిక సాంకేతిక ఆధారాలను సేకరించారు. నిందితుల కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు.. నల్లజర్లతాడేపల్లిగూడెం ఎస్ ఎచ్ -24 రహదారిపై వారిని వ్యూహాత్మకంగా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి చోరీకి గురైన బంగారు, వెండి ఆభరణాలు, మొబైల్ ఫోన్లు, అలాగే నేరానికి ఉపయోగించిన పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.
జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ (ఐపీ ఎస్ ) ఆదేశాల మేరకు.. జంగారెడ్డిగూడెం ఏ ఎస్పీ సుస్మితా, ట్రైనీ ఐపీ ఎస్ జయా శర్మల పర్యవేక్షణలో పోలీసులు వేగంగా స్పందించారు. ఏలూరు డీ ఎస్పీ డి. శ్రావణ్ కుమార్ నేతృత్వంలో నిడమర్రు సిఐ నక్కా రజనీ కుమార్, భీమడోలు సిఐ కృష్ణ, చేబ్రోలు ఎస్ఐ ఎం. సూర్య భగవాన్, ఐటీ కోర్ మరియు స్పెషల్ బ్రాంచ్ బృందాలు ఉమ్మడిగా శ్రమించి, ఈ మిస్టరీని ఛేదించాయి. అత్యంత వేగంగా కేసును ఛేదించిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# ప్రజలనుమోసం చేయడంలో రేవంత్ రెడ్డి నెంబర్ వన్...





దేవరకద్ర జూన్ 6 నేషనలిస్ట్ వాయిస్

తెలంగాణ ప్రజలను మోసం చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెంబర్ వన్ లో ఉన్నారని బి ఆర్ ఎస్ మంత్రులు ఎమ్మెల్యేలు అన్నారు. శనివారంజిల్లా కేంద్రం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్ ,డా.సి.లక్ష్మారెడ్డి , మాజీ ఎమ్మెల్యే లు ఆల వెంకటేశ్వర్ రెడ్డి , చిట్టెం రామ్మోహన్ రెడ్డి ,అంజయ్య యాదవ్ , ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి ,మాజీ కార్పొరేషన్ చైర్మన్ వాల్య నాయక్ ,ఇంతియాజ్, ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి రెండురన్న ఏండ్ల ముఖ్యమైన సమయాన్ని సీఎం వృథా చేశారు..పాదయాత్ర ప్రకటన చేశాకే జిల్లా పర్యటనకు వచ్చారు.కేసీఆర్ ని తిట్టడానికి ఇన్ని కోట్లు ఖర్చు పెట్టీ పర్యటన చేయాలా?సమీక్షకు సంబంధించి ప్రెస్ నోట్ ఇవ్వలేదు.పనులు ఎక్కడి వరకు వచ్చాయి. ఏం చేయాలి అనే దానిపై స్పష్టత లేదు.అబద్ధపు పునాదుల మీద ఏర్పాటైన ప్రభుత్వం అబద్ధాలు చెప్తుంది..భూ సేకరణ చేయలేదని అంటున్నారు..ఐదు రిజర్వాయర్ ల కోసం 27000 ఎకరాలు భూసేకరణ చేశాం..రెండున్నర ఏండ్లు కేసీఆర్ ని తిట్టడానికే సరిపోయింది..14 లో 12 గెలిపిస్తే జిల్లాకు ఒరిగింది ఏంటి?మేం వచ్చాక వరి ఎక్కువ సాగయింది అంటున్నారు..ఒక్క ఎకరాకు నీళు ళ్ల ఇవ్వకుండా సాగు ఎట్లా పెరిగింది..ఆయకట్టు పెరగకుండా పంట ఎక్కువ ఎట్లా వస్తుంది..మీరు చేసిందేమీ లేదు.ఉమ్మడి రాష్ట్రంలో జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు లేదు..మేము దిగిపోయినాటికి ఎనిమిదిన్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందింది..జూరాల సోర్స్ తో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ కు నీళ్ళు ఎట్లా అందుతాయి.సీఎం కు ఆంధ్రాకు ఎట్లా లాభం జరుగుతుంది అనే దానిపై శ్రద్ధ ఉంది..కర్ణాటక ఆడుతున్న ఆటలో పావులు అవుతున్నారు..కానాయపల్లి ఆర్ అండ్ ఆర్ సమస్య ఏమైంది.ఎమ్మెల్యే సీఎం దృష్టికి తీసుకెళ్లలేదు..జిల్లాకు వచ్చినం.. పోయినం కాదు... మొక్కుబడి సమీక్షలు కాదు..పనులు జరగాలి..ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేసి పాలమూరు పూర్తి చేయాలి.ఇరవై వేల కోట్లు ఏడాదికి ఇస్తా అన్నారు..రెండున్నర ఏండ్లు అయింది.యాభై వేల కోట్లు కాదు..ఐదు వందల కోట్లు రాలేదు.. బిజెపి జాతీయ హోదా ఇస్తామని అన్నారు..కేసీఆర్ జిల్లా మీద ప్రేమ ఉంది కాబట్టే... పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ చేపట్టారు..కేసులు పెట్టి ఆపకపోతే మా హయాంలోనే మొత్తం పూర్తి చేసే వాళ్ళం..సీఎం ఇప్పటికైనా మేలుకో పోతే పాలమూరు ప్రజల ముందు దోషిగా నిలబడతారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# ఆదాయం కోసం అడ్డగోలు నిర్ణయాలు

## భూముల విలువలకు తోడు..మద్యం ధరలు

## ఈ నెలలోనే మద్యం ధరలు పెంచే యోచన

హైదరాబాద్,జూన్6 (నేషనలిస్ట్ వాయిస్)

రాష్ట్ర ప్రభుత్వం భూముల విలువలను పెంచేసింది. ఆదాయం సమకూర్చుకోవడం లక్ష్యంగా ఎట్టకేలకు శుక్రవారం నుంచి అమలులోకి తెచ్చింది. మరో వారం పదిరోజుల్లో మద్యం ధరలు కూడా పెరగనున్నాయి. ఒక్కో బాటిల్పై 80 నుంచి వందవరకు పెంచుతారన్న ప్రచారం సాగుతోంది. తెలంగాణలో మద్యం ధరలు పెరగనున్నాయి. పెరిగిన ధరలు ఈనెల 15 నుంచి అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. లిక్కర్ తయారీ కంపెనీల ఒత్తిడి మేరకు ప్రభుత్వం మద్యం ధరలను పెంచడానికి సిద్ధమైనట్లు సమాచారం. ముడి సరుకుల ధరలు, రవాణా ఖర్చులు బాగా పెరిగిన నేపథ్యంలో మద్యం ధరలను కూడా పెంచాలని లిక్కర్ కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఈమేరకు ప్రభుత్వం కూడా సానుకూలంగానే ఉంది. భూముల ధరలు పెంచడం, మద్యం ధరలు పెంచడం ద్వారా ఉచిత పథకాలకు ఢోకా లేకుండా చూసుకుంటున్నారు. అలాగే భూములను కూడా ఎక్కడిక్కడ తెగనమ్ముతున్నారు. ఇదిలావుంటే ఈసారి భూముల విలువలు పెరుగుతాయనే అనుమానంతో ఆస్తుల క్రయ, విక్రయదారులు గురువారం వరకు పెద్ద మొత్తంలో స్లాట్లు బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తాజాగా, భూముల మార్కెట్ విలువలు రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి రాగానే రిజిస్ట్రేషన్లు తక్కువ సంఖ్యలో అయ్యాయి. ప్రతి జిల్లాలో సగటున 50శాతం వరకు భూ విలువలు పెరగ్గా, కమర్షియ ల్ ప్రాంతాల్లో భారీగా పెంచారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ అధికారులు పెద్దగా పెంపు లేదని చెబుతున్నా, ప్రాంతాల వారీగా పెరిగిన మార్కెట్ విలువలను చూస్తుంటే రిజిస్ట్రేషన్ల భారం అధికంగానే ఉంది. భూముల ధరలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలతో పాటు అభివృద్ధి, పారిశ్రామిక ప్రాంతాలు ఉన్న చోట మార్కెట్ విలువలను 50శాతం మేర పెంచారు. గ్రామీణ, పట్టణాల్లో క్షేత్రస్థాయి అధ్యయనం చేసి శాస్త్రీయంగా మార్కెట్ విలువలను సవరించామని అధికారులు చెబుతున్నా, ఆస్తుల క్రయ విక్రయదారులకు భారీగానే భారం మోపారని తెలుస్తోంది. ధరలు పెరుగుతాయని ముందస్తు సమాచారం తోనే పాత ధరలకే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పలువురు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. భూముల విలువలు సవరణతో మార్కెట్ విలువ ప్రకారం అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో రిజిస్ట్రేషన్లు భారం కానున్నాయి. వాస్తవానికి ఏటా కొంత మేరకు మార్కెట్ విలువలను సవరించాల్సిన ప్రభుత్వం ఏకంగా ఒకేసారి పెంచడంతో ఆస్తుల క్రయవిక్రయదారులపై భారం పెరిగింది. ప్రజలపై భారాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వ ఖజానాను నింపేలా మాత్రమే అధికారులు కసరత్తు చేశారని తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిన అధికారులు గతంలో ఉన్న మార్కెట్ విలువలను రెట్టింపు చేశారని, ఇది శాస్త్రీయంగా లేదని పలువురు పేర్కొంటున్నారు. వ్యవసాయ భూముల విలువను సైతం భారీగా పెంచడంతో ఆస్తుల కొనుగోలుదారులు ఆందోళనకు గురవుతున్నారు. కమర్షియల్ ప్రాంతాల్లో 100శాతం మేరకు మార్కెట్ విలువలను పెంచారు. కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో, రిజిస్ట్రేషన్లు తక్కువగా ఉన్న చోట స్వల్పంగా పెంచినా, పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరేలా మార్కెట్ విలువను పెంపుదల చేశారు. మార్కెట్ విలువలు పెరగడంతో స్టాంపు డ్యూటీ, ఇతర రిజిస్ట్రేషన్ చార్జీల భారం సామాన్య, మధ్య తరగతి ప్రజలపై అధికంగానే ఉండనుంది.

# ప్రజల భాగస్వామ్యంతోనే నగర అభివృద్ధి సాధ్యం

## - ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో వార్డు సభల నిర్వహణ

## - నల్లగొండ మున్సిపల్ కమిషనర్ బచ్చలకురి శరత్ చంద్ర

నల్లగొండ,జూన్6 (నేషనలిస్ట్ వాయిస్)

ప్రజల భాగస్వామ్యంతోనే నగర అభివృద్ధి సాధ్యమవుతుందని నల్లగొండ మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ బచ్చలకురి శరత్ చంద్ర అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం రెండో విడతగా పలు వార్డుల్లో ప్రత్యేక వార్డు సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డు స్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి స్థానిక సమస్యలకు వేగవంతమైన పరిష్కారం చూపడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. చెత్తను మూలం వద్దనే వేరు చేయడం ద్వారా పరిశుభ్రమైన నగర నిర్మాణంతో పాటు వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ సాధ్యమవుతుందన్నారు. జల్ సంచయ్- జల్ భాగీధారి కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, రూఫ్టాప్ రైన్ వాటర్ హార్వెస్టింగ్ చర్యల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి కుటుంబం వర్షపు నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని, భూగర్భ జలాల పెంపునకు సహకరించాలని పిలుపునిచ్చారు.రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో చేపడుతున్న డ్రైనేజీల పూడికతీత పనులు, మురుగు కాలువల శుభ్రత, వర్షాకాల సన్నద్ధత చర్యల గురించి ప్రజలకు వివరించారు. డ్రైనేజీలలో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని, నీటి ప్రవాహానికి ఆటంకాలు కలగకుండా చూడాలని సూచించారు. నగరంలో తాగునీటి సరఫరా, పైప్లైన్ నిర్వహణ, పారిశుధ్య సేవలు, వీధి దీపాల నిర్వహణ, అంతర్గత రహదారుల అభివృద్ధి, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిరంతరంగా చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. పచ్చదనం పెంపు ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వర్షాకాలంలో నీటి నిల్వలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం వల్ల దోమల వ్యాప్తిని నివారించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, తాగునీటిని శుద్ధి చేసి వినియోగించడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని ప్రజలకు సూచించారు. రఫియోద్దీన్, వార్డు అధికారులు, మున్సిపల్ అధికారులు, శానిటరీ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# నందిగామలో మానవత్వం నిరుపేద యువతి వివాహానికి దాతల అండ

- ఘనంగా ముగిసిన షేక్ గౌసియా పెళ్లి
- రూ. 10,000 ఆర్థిక సాయం అందించిన బీజేపీ నేత షేక్ సైదా
- మరో రూ. 10,500 విరాళం అందజేసిన పలువురు దాతలు

**నందిగామ, జూన్ 6: (నేషనలిస్ట్ వాయిస్)**

సమాజంలో మానవత్వం ఇంకా బతికే ఉందని నిరూపిస్తూ, ఒక నిరుపేద యువతి పెళ్లికి పలువురు దాతలు ఆర్థిక సహాయం అందించి తమ ఉదారతను చాటుకున్నారు. మధిర గ్రామానికి చెందిన షేక్ గౌసియా వివాహం శుక్రవారం నాడు బంధుమిత్రుల సమక్షంలో అత్యంత ఘనంగా జరిగింది. ఇటీవలే గౌసియా పెళ్లి పనుల నిమిత్తం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నందిగామ ముఖ్య నేత షేక్ సైదా రూ. 10,000 ఆర్థిక సహాయం అందించిన సంగతి తెలిసిందే. కాగా, శుక్రవారం జరిగిన వివాహ వేడుకకు షేక్ సైదా స్వయంగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పెళ్లి తర్వాత ఎదురయ్యే ఖర్చుల నిమిత్తం మరికొందరు దాతలు ముందుకొచ్చి తమ వంతు సహాయాన్ని ప్రకటించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సైదా చేతుల మీదుగా ఈ అదనపు ఆర్థిక సహాయాన్ని వధువు గౌసియాకు అందజేశారు. ఆర్థిక సహాయం అందించిన దాతల వివరాలు: ప్రకారం దాత పేరు సహాయం చేసిన మొత్తం (రూపాయల్లో)బి.బి.కె. రావు రూ. 5,000/-, అంశాలి సాహెబ్ రూ. 2,000/-, మహమ్మద్ షా రూ. 1,000/-, గౌస్ం౯ ూ . 1,000/-మస్తాన్వలి రూ. 1,000/-, ఎస్కేలాల రూ. 500/-తమ వివాహానికి పెద్ద మనసుతో ఆర్థిక సహాయం అందించి, అండగా నిలిచిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సైదాకు, అలాగే ఇతర దాతలందరికీ వధువు షేక్ గౌసియా ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. విపత్కర పరిస్థితుల్లో తమ కుటుంబానికి చేసిన ఈ సహాయాన్ని ఎన్నటికీ మరువలేమని ఆమె భావోద్వేగానికి లోనయింది.



# మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

- ఆచూకీ తెలిపి కుటుంబానికి సహకరించండి

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 06 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**



వరంగల్ నగర పరిధిలోని భీమారం గ్రామానికి చెందిన కందుల రాజు (47) అనే వ్యక్తి ఈ నెల 1వ తేదీ సోమవారం మధ్యాహ్నం 11 గంటల నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. కందుల రాజు తండ్రి పేరు సాయిలు. ఆయనకు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. కుటుంబ సభ్యులు బంధువులు, పరిచయస్తుల వద్దతో పాటు వివిధ ప్రాంతా ల్లో గాలించినప్పటికీ ఆయన ఆచూకీ లభించలేదు. ఈ విషయమై కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసినట్లు తెలిపారు. కందుల రాజు ఆచూకీ తెలిసిన వారు వెంటనే కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌కు లేదా కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని కోరుతున్నారు. ఆయనను ఎక్కడైనా గుర్తించిన వారు 98669 29151 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# భువనగిరి మార్కెట్‌లో జంక్షన్ బాక్సుల ధ్వంసం

## - విలువైె వైర్లు కత్తిరించి ఎత్తుకెళ్లిన దొంగలు

**భువనగిరి,జూన్6 (నేషనలిస్ట్ వాయిస్)**


యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో భారీ చోరీ ఘటన వెలుగు చూసింది. గుర్తు తెలియని దుండగులు రాత్రి వేళ మార్కెట్ ప్రాంగణంలోకి ప్రవేశించి విద్యుత్ వ్యవస్థకు సంబంధించిన జంక్షన్ బాక్స్‌లను ధ్వంసం చేసి సుమారు రూ. 25 లక్షల విలువ గల విద్యుత్ వైర్లను శుక్రవారం రాత్రి ఎత్తుకెళ్లినట్లు అధికారులు తెలిపారు. సమాచారం ప్రకారం ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ సరఫరా వ్యవస్థలో భాగంగా ఉన్న జంక్షన్ బాక్స్‌లను దుండగులు లక్ష్యంగా చేసుకున్నారు. ముందుగా విద్యుత్ కనెక్షన్లను ధ్వంసం చేసి, విద్యుత్ వైర్లను కత్తిరించి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. శనివారం ఉదయం విధులకు వచ్చిన సిబ్బంది జంక్షన్ బాక్స్‌లు ధ్వంసమై ఉండడాన్ని గమనించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన అధికారులు ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు రూ. 25 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. మార్కెట్‌లో విద్యుత్ సరఫరా వ్యవస్థకు అంతరాయంతో పాటు ప్రభుత్వ ఆస్తికి భారీ నష్టం సంభవించిందని తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో విద్యుత్ వైర్లు చోరీ కావడం స్థానికంగా సంచలనం రేపింది. మార్కెట్ వంటి కీలక ప్రభుత్వ ప్రాంగణంలో భద్రతా లోపాలు ఎలా చోటు చేసుకున్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాత్రి వేళల్లో నిఘా, సీసీ కెమెరాల పర్యవేక్షణ, భద్రతా సిబ్బంది విధులపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనపై మార్కెట్ అధికారులు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. చోరీ జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తూ దుండగుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నేరంలో పాల్గొన్న వారిని త్వరలోనే గుర్తించి చట్టపరమైన తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ప్రభుత్వ ఆస్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వంటి ప్రధాన కేంద్రాల్లో రాత్రి వేళల్లో నిఘాను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రజల దీవెనలే మా బలం సేవే మా ధ్యేయం..

## - కోనేరు కోనప్ప - సిర్పూర్ మాజీ శాసనసభ్యులు..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూన్ 06 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) నియోజకవర్గం కాగజ్ నగర్ పట్టణంలో తీవ్ర ఎండలతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి, వారికి చల్లదనం, ఉపశమనం అందించాలనే సంకల్పంతో 2010 సంవత్సరంలో అంబలి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాము. ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సే లక్ష్యంగా చేపట్టిన ఈ సేవా కార్యక్రమానికి ప్రజల నుండి అపూర్వమైన ఆదరణ, ఆశీర్వాదాలు లభించాయి.
ఈ ఏడాది 62 రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగిన అంబలి పంపిణీ కార్యక్రమంలో సుమారు 2,50,000 లీటర్ల అంబలిని తయారు చేసి, 5 లక్షల మందికి పైగా పంపిణీ చేయడం జరిగింది. ఎండ వేడితో అలసిపోయిన ప్రజలకు ఇది చల్లని ఉపశమనంగా మారడమే కాకుండా, దూర ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణికులు, కార్మికులు, నిరుపేదలకు ఆకలి బాధను కూడా దూరం చేసింది. ప్రజల నుండి వచ్చిన విశేష స్పందనను దృష్టిలో ఉంచుకుని కాగజ్‌నగర్‌తో పాటు పరిసర మండలాల వారాంతపు సంతల్లో కూడా అంబలి పంపిణీ నిర్వహించాము. అలాగే గతంలో హైదరాబాద్‌లోని నిలోఫర్, నిమ్స్, ఉస్మానియా, బసవతారకం ఆసుపత్రుల వద్ద నాలుగు సంవత్సరాల పాటు ప్రతిరోజూ వేలాది మందికి అంబలి పంపిణీ చేసి రోగులతో పాటు వారి బంధువులకు కూడా ఉపశమనం కల్పించాము. ఈ సేవా యజ్ఞం విజయవంతం కావడానికి అంబలి తయారీలో అహర్నిశలు శ్రమించిన కార్మికుల కృషి ఎంతో గొప్పది. 46 డిగ్రీల తీవ్ర ఉష్ణోగ్రతల మధ్య వేడివేడి పొయ్యిల వద్ద గంటల తరబడి శ్రమించి అంబలిని సిద్ధం చేసిన వారి సేవలు మరువలేనివి. అలాగే ప్రతిరోజూ 15 మంది స్వచ్ఛందంగా పాల్గొని అంబలి పంపిణీ చేసిన సేవాభావం కలిగిన కార్యకర్తలకు, అభిమానులకు, మిత్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.
కొంతమంది ఈ కార్యక్రమాన్ని రాజకీయ కోణంలో చూసినప్పటికీ, అంబలి సేవించిన ప్రతి ఒక్కరి ముఖంలో కనిపించిన సంతోషమే మాకు నిజమైన గుర్తింపు. ప్రజల ప్రేమాభిమానాలు, ఆశీర్వాదాలే మాకు ప్రేరణ. అంబలి సేవించిన వేలాది మంది ప్రజలు నేను, నా కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉండాలని మనస్ఫూర్తిగా దీవించడం మా జీవితంలో అత్యంత విలువైన



సంపద. ప్రజల దీవెనలే మాకు శ్రీరామరక్ష. గతంలో ప్రజాసేవ చేశాము, ప్రస్తుతం చేస్తున్నాము, భవిష్యత్తులో కూడా సిర్పూర్ నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం అంకితభావంతో సేవ చేయడమే మా లక్ష్యం, మా సంతృప్తి.
గమనిక: 12-06-2026 (శుక్రవారం) నుండి యథావిధిగా అన్నదాన కార్యక్రమం తిరిగి ప్రారంభించబడుతుంది. అని తెలియచేశారు.

# మహిళల భద్రత పోలీసుల ప్రధాన లక్ష్యం

## - వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 06 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

మహిళ భద్రతే ప్రధాన లక్ష్యం గా పోలీసులు పనిచేస్తారని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా రెవిన్యూ పోలీసుల ఆధ్వ ర్యంలో శనివారం ధర్మసాగర్ మండలం పెండ్యాల గ్రామం లో గ్రామ సభను నిర్వ హించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిధిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో గ్రామస్తులను ఉదేశ్యస్తూ వరంగల్ సీపీ ముందుగా మహిళ భద్రత గురించి మాట్లాడుతూ ప్రతి మహిళ ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగి పోవాలని, ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని. మహిళలు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగి



పోవాలని, మహిళలు తాము అనుకున్న లక్ష్యాల ను సాధించాలంటే ఆత్మ విశ్వాసం అవసరమని, మహిళల భద్రతకై షీ టీం విభాగం పనిచేస్తుందని ఎవరైనా వేధింపులకు



పాల్పడితే మౌనం వీడి పోలీసులకు సమాచారం ఇవ్వాలని, మహిళలు తమ. పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, పిల్లల అభి వృద్ధిలో మహిళల పాత్ర కీలకమని సీపీ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు బాధ్యా తాయుతంగా వ్యవహరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించగలమని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ధర్మ సాగర్ ఇన్స్ స్పెక్టర్ శ్రీధర్ రావు, స్థానిక సర్పంచ్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ఈవీఎంల గోదామును తనిఖీచేసిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్





**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 06 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

హనుమకొండ సుబేదారిలోని రెడ్ క్రాస్ భవనం వెనుక ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు (ఈవీఎంలు), వివి ప్యాట్‌లు భద్రపరిచిన గోదాం ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి శనివారం గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఈ పరిశీలన చేపట్టారు. గోదాం లో పటిష్ట భద్రత నడుమ భద్ర పరిచిన ఈవీఎంలు, వివి ప్యాట్‌లు, బ్యాలెట్ యూని ట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్ని కల సామగ్రి నిల్వ ఉంచిన గదులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా చర్యల్లో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పని తీరు, గోదాం భద్రతా వ్యవస్థలను సమీక్షించారు. ఈవీఎంల భద్రత విషయం లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్వ హణకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి సంతకాలు చేశారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధు లు ఇ.వి. శ్రీనివాసరావు, రావు అమరేందర్ రెడ్డి, కుసుమ శ్యాంసుందర్, నాగబెల్లి రజనీకాంత్, సయ్యద్ ఫైజుల్లా, మణి, లక్ష్మణ్, ఎం.డి. నేహాల్ తదితరులు పాల్గొన్నారు.

# సహారా ఎడారిలో మృత్యు ఘోష నీళ్లు లేక 49మంది మృత్యువాత

**సహారా,జూన్6 (నేషనలిస్ట్ వాయిస్)**

పశ్చిమాఫ్రికాలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. సహారా ఎడారిలో తాగేందుకు నీరు దొరక్క దాహంతో 49 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు ఆగిపోవడంతో వీరంతా కొన్ని రోజుల పాటు ఎడారిలో నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. నైజర్ దేశంలో ఈ దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నైజర్‌కు చెందిన కొంతమంది తమ బంధువులతో పండుగ చేసుకునేకుందుకు పక్కనే ఉన్న మాలి దేశానికి ట్రక్కులో బయల్దేరారు. ఆ వేడుక ముగించుకొని తిరిగివస్తుండగా.. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు అసమాకా అనే సరిహద్దు ప్రాంతానికి 80 కిలోమీటర్ల దూరంలో ఆగిపోయింది. అయితే, ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటంతో సాయం చేసేవారు దొరకలేదు. డ్రైవర్‌తో పాటు అందులోని ప్రయాణికులు ట్రక్కును మరమ్మతు చేసేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. దీంతో వారంతా కొన్ని రోజుల పాటు ఎడారిలోనే ఉండాల్సి వచ్చింది. అప్పటికే వారి వద్ద ఉన్న నీటి నిల్వలు నిండుకున్నాయి. ఎడారిలో నీటి జాడ లేకపోవడంతో వారు దాహంతో అల్లాడిపోయారు. చివరకు ఇద్దరు వ్యక్తులు దాదాపు 50 కిలోమీటర్లకు పైగా కాలినడకన వెళ్లి నీరు తాగి అక్కడినుంచి అసమాకా పట్టణానికి చేరుకున్నారు. అక్కడ అధికారులను కలిసి విషయం చెప్పారు. అప్రమత్తమైన అధికారులు ఘటనా స్థలానికి చేరుకోగా.. హృదయ విదారక దృశ్యాలు కన్పించాయి. ట్రక్కు చుట్టూ డజన్ల కొద్దీ మృతదేహాలు కన్పించాయని అధికారులు తెలిపారు. విపరీతమైన వేడి, ఉక్కపోత, నీరు లేక 49 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. అయితే, ట్రక్కు ఆగిపోవడానికి కారణమేంటీ, వీరు ఎడారిలో ఎన్ని రోజులు చిక్కుకుపోయారన్న దానిపై స్పష్టత లేదు. సాధారణంగా ఈ ఎడారి జోన్ మీదుగా పౌరులు రాకపోకలు సాగించడం చాలా అరుదని స్థానిక అధికారులు వెల్లడించారు. ఎక్కువ ఆఫ్రికా దేశాల నుంచి యూరప్‌కు వలసవెళ్లేవారు ఈ మార్గాన్ని ఆశ్రయిస్తారని తెలిపారు. గతంలోనూ అనేక మంది ఇసుక వేడి, దాహం, ఆకలితో ఈ మార్గంలో ప్రాణాలు విడిచినట్లు గుర్తుచేసుకున్నారు.

# రాహుల్, గిల్ సెంచరీల మోత..

## భారీ స్కోరు దిశగా భారత్..! అఫ్ఘాన్‌తో భారత్ ఏకైక టెస్టు





అఫ్ఘానిస్థాన్‌తో శనివారం ప్రారంభమైన ఏకైక టెస్టు తొలి రోజు ఆటలో టీమిండియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ముల్లాన్‌పూర్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్.. తొలి రోజు ముగిసేసరికి 3 వికెట్ల నష్టానికి 368 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ శతకాలతో కదం తొక్కగా, యువ బ్యాటర్ సాయి సుదర్శన్ (81), రిషభ్ పంత్ (50 నాటౌట్) అర్ధసెంచరీలతో రాణించారు. అఫ్ఘాన్ బౌలర్లలో సలీమ్ సఫీ రెండు వికెట్లు పడగొట్టాడు. అఫ్ఘానిస్థాన్‌తో శనివారం ప్రారంభమైన ఏకైక టెస్టు మ్యాచ్ తొలి రోజు ఆటలో టీమిండియా ఆధిక్యం కనబరిచింది. న్యూచండీగఢ్‌లోని ముల్లాన్‌పూర్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నాడు. యశస్వి జైశ్వాల్‌తో పాటు కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్ ప్రారంభించాడు. అయితే 32 బంతుల్లో 24 రన్స్ చేసిన తర్వాత జైశ్వాల్.. తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన సాయి సుదర్శన్.. రాహుల్‌తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు.ఆడేది టెస్టు మ్యాచ్ అయినా.. సాయి సుదర్శన్ మాత్రం వేగంగా పరుగులు రాబట్టాడు. హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుని.. సెంచరీ దిశగా అడుగులు వేశాడు. మరోవైపు కేఎల్ రాహుల్ కూడా ఈజీగా పరుగులు రాబట్టాడు. దీంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ఈ క్రమంలోనే కేఎల్ రాహుల్ శతకం పూర్తి చేసుకున్నాడు. అయితే అదే స్కోరు వద్ద అతడు క్యాచ్ ఔట్ అయ్యాడు. సాయి సుదర్శన్ 104 బంతుల్లో 81 రన్స్ చేసి పెవిలియన్ చేరిపోయాడు. రాహుల్, సుదర్శన్.. రెండో వికెట్‌కు 139 పరుగులు జోడించారు. ఆ తర్వాత స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లే బాధ్యతను కెప్టెన్ శుభ్‌మన్ గిల్ , రిషభ్ పంత్ తీసుకున్నారు. ఈ క్రమంలోనే శుభ్‌మన్ గిల్.. తన టెస్ట్ కెరీర్‌లో మరో శతకాన్ని పూర్తి చేశాడు. మరోవైపు రిషభ్ పంత్ కూడా ధాటిగా బ్యాటింగ్ చేసి.. అర్ధశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్.. 85 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 368 పరుగులతో నిలిచింది. ప్రస్తుతం క్రీజులో శుభ్‌మన్ గిల్ (143 బంతుల్లో 103 రన్స్), రిషభ్ పంత్ (70 బంతుల్లో 50 రన్స్) ఉన్నారు. అఫ్ఘానిస్థాన్ బౌలర్లలో మహమ్మద్ సలీమ్ సఫీ రెండు వికెట్లు తీశాడు. రెహ్మాన్ షరీఫ్ ఒక వికెట్ పడగొట్టారు. టీమిండియా రెండో రోజు ఆటలో 500 రన్స్ మార్కును చేరుకుని.. ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసే అవకాశం ఉంది.

# సచిన్ రికార్డు బ్రేక్ చేసిన వైభవ్



ఐపీఎల్ 2026లో రికార్డుల మోత మోగించిన 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి జాతీయ జట్టు నుంచి తొలిసారి పిలుపు వచ్చింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌ల కోసం ప్రకటించిన భారత జట్టులో అతడికి చోటు దక్కింది. 15 ఏళ్ల 70 రోజుల వయసులోనే ఎంపికై సచిన్ టెండూల్కర్ రికార్డును వైభవ్ బ్రేక్ చేశాడు. ఐపీఎల్‌లో 776 పరుగులు, 72 సిక్సర్లతో ఆరెంజ్ క్యాప్, మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ అవార్డులను గెలుచుకుని, సెలక్టర్లు కచ్చితంగా ఎంపిక చేయాల్సిన పరిస్థితిని అతడు కల్పించాడు.15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్‌లో రికార్డుల బూజు దులిపిన వైభవ్ సూర్యవంశీకి జాతీయ జట్టు నుంచి పిలుపు అందింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో త్వరలో జరగనున్న టీ20 సిరీస్ కోసం భారత సెలక్షన్ కమిటీ శనివారం జట్లను ప్రకటించింది. ఇందులో వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కింది. తన ప్రదర్శనతో జట్టులో ఎంపిక చేయక తప్పని పరిస్థితిని వైభవ్ కలిగించాడని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ వెల్లడించాడు. అయితే భారత జట్టు నుంచి తొలిసారి పిలుపు అందుకోవడం ద్వారా.. వైభవ్ సూర్యవంశీ రికార్డు క్రియేట్ చేశాడు.15 ఏళ్ల 70 రోజుల వయసులో వైభవ్‌కు టీమిండియా నుంచి పిలుపు అందింది. గతంలో ఈ రికార్డు టీమిండియా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉంది. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్.. భారత్ తరపున 16 ఏళ్ల 205 రోజులు ఉన్నప్పుడు ఎంపికయ్యాడు. తాజాగా ఆ రికార్డును వైభవ్ సూర్యవంశీ బ్రేక్ చేశాడు. ప్రపంచ దృష్టిని తనవైపు ఆకర్షించాడు. కాగా ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026లో వైభవ్ సూర్యవంశీ పలు భారీ రికార్డులు బ్రేక్ చేశాడు. తన పవర్ బ్యాటింగ్‌తో సత్తాచాటిన అతడు.. భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. ఈ సీజన్‌లో అతడు ఏకంగా 72 సిక్సర్లు బాదాడు. దీంతో ఓ ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన గేల్ రికార్డును బ్రేక్ చేశాడు. యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్.. 2012 సీజన్‌లో 65 సిక్సర్లు బాదడం గమనార్హం. మరోవైపు ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ ఎడిషన్‌లో ఈ 15 ఏళ్ల చిచ్చర పిడుగు 16 మ్యాచులలో ఆడాడు. అందులో ఏకంగా సుమారు 240 స్ట్రైక్ రేటుతో 776 పరుగులు స్కోరు చేశాడు. దీంతో ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. అంతేకాకుండా 436.5 పాయింట్స్‌తో మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్ అవార్డు సొంతం చేసుకున్నాడు. 72 సిక్సర్లతో సూపర్ సిక్సెస్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచాడు. 237.31 స్ట్రయిక్ రేట్‌తో సూపర్ స్ట్రయికర్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచాడు. ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్ అవార్డు కూడా వైభవ్ సూర్యవంశీకే దక్కడం గమనార్హం.



# టెస్టు క్రికెట్ మ్యాచ్ మధ్యలో పింక్ బాల్..

రానున్న రోజుల్లో టెస్టు క్రికెట్‌లో ఐసీసీ కొత్త రూల్‌ని ప్రవేశపెట్టనుంది. కొన్ని కొన్ని సార్లు బ్యాడ్ లైట్ కారణంగా ఆ రోజులో వేయాల్సిన ఓవర్లు ఉన్నా మ్యాచ్‌ని ముందుగానే ముగిస్తుంటాం. ఇకపై ఇలాంటి పరిస్థితి వచ్చినప్పుడు పింక్ బాల్‌ని ఉపయోగించేలా ఐసీసీ కొత్త రూల్ తీసుకొస్తోంది. ఐసీసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సమర్థించాడు. అక్టోబర్ 1 నుంచి ఈ రూల్ అమలులోకి రానుంది.ఐసీసీ తాజాగా క్రికెట్‌లో కొత్త నిబంధన తీసుకొచ్చింది. టెస్టు క్రికెట్‌లో బ్యాడ్ లైట్ కారణంగా ఆటకు అంతరాయం కలిగినప్పుడు పింక్ బాల్‌ను ఉపయోగించాలని అని ఐసీసీ తీసుకున్న నిర్ణయాన్ని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్వాగతించాడు. ఈ కొత్త నిర్ణయం అక్టోబర్ 1 నుంచి అమలులోకి రానున్నట్లు ఐసీసీ పేర్కొంది. ఇటీవల జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో సాధారణ టెస్టు మ్యాచ్‌లలో కూడా పింక్ బాల్‌ను ప్రయోగాత్మకంగా ఉపయోగించేందుకు ఆమోదం లభించింది. మ్యాచ్ ఎప్పటిలాగా రెడ్ బాల్‌తోనే ప్రారంభమవుతుంది.

# రోహిత్ మళ్లీ అద్భుతాలు సృష్టిస్తాడు

## కోచ్ దినేష్ లాడ్ గట్టి కౌంటర్



ఇండియా మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ ఫామ్, ఫిట్‌నెస్ పై వస్తున్న విమర్శలకు అతడి చిన్ననాటి కోచ్ దినేష్ లాడ్ గట్టి కౌంటర్ ఇచ్చాడు. శుక్రవారం ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో దినేష్ లాడ్ మాట్లాడుతూ, రోహిత్ ఎవరికీ ఏమీ నిరూపించుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశాడు. ఇండియాకు వన్డే వరల్డ్ కప్ గెలిపించాలనే పట్టుదల రోహిత్ ను ఇంకా మోటివేట్ చేస్తోందని అన్నాడు. వన్డే క్రికెట్ లో మూడు డబుల్ సెంచరీలు చేసిన ఏకైక ప్లేయర్ రోహిత్ అని, 2019 వరల్డ్ కప్ లో ఐదు సెంచరీలు చేసిన రికార్డు అతడికి ఉందని గుర్తు చేశాడు. టెస్టులు, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్, వన్డేల్లో మాత్రం ఇండియాను ఫైనల్స్ కు చేర్చడానికి తన ఎక్స్ పీరియన్స్ తో హెల్ప్ అవుతాడని చెప్పాడు.రోహిత్ శర్మ రాబోయే ఆరు నెలల్లో తన ఫిట్‌నెస్, బ్యాటింగ్ ఫామ్ ను నిరూపించుకుంటేనే 2027 వన్డే వరల్డ్ కప్ సెలెక్షన్ ప్లాన్స్ లో ఉంటాడని మాజీ సెలెక్టర్ సబా కరీం చేసిన కామెంట్స్ పై దినేష్ లాడ్ మండిపడ్డాడు. ఆరు నెలల టైమ్ అనేది ఒక్క రోహిత్ కే కాదు, టీమ్ లోని ప్రతి ప్లేయర్ కు ఇంపార్టెంట్ అని అన్నాడు. రోహిత్ 2027 వరల్డ్ కప్ కచ్చితంగా ఆడతాడని తనకు 100 పర్సెంట్ గ్యారెంటీ ఉందని స్పష్టం చేశాడు. రోహిత్ ఖాళీగా ఉంటూ లైఫ్ ఎంజాయ్ చేయడం లేదని, ప్రతిరోజూ ప్రాక్టీస్ చేస్తూ తన ఫిట్‌నెస్ పై వర్క్ చేస్తున్నాడని తెలిపాడు. న్యూజిలాండ్ తో జరిగిన వన్డే సిరీస్ లో మూడు ఇన్నింగ్స్ లో 61 రన్స్ మాత్రమే చేయడంతో రోహిత్ పై విమర్శలు పెరిగాయి. అయితే రోహిత్ టెక్నిక్ పరంగా ఎలాంటి ప్రాబ్లం లేదని లాడ్ అన్నాడు. వన్డే క్రికెట్ లో కాసేపు క్రీజులో సెటిల్ అవ్వడం లో అవసరం లేదని అన్నాడు.

# నార్వే చెస్ చాంపియన్‌గా ప్రజ్ఞానంద..



భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద అంతర్జాతీయ చదరంగ వేదికపై సరికొత్త చరిత్ర సృష్టించారు. ప్రతిష్ఠాత్మక నార్వే చెస్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన తొలి భారతీయ ఆటగాడిగా ఆయన రికార్డు సృష్టించారు. ఈ అద్భుత విజయంపై స్పందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియా వేదికగా ప్రజ్ఞానందకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రజ్ఞానంద సాధించిన ఈ ఘనత భారత చెస్ రంగానికి ఒక గొప్ప మైలురాయి అని, అంతర్జాతీయ స్థాయిలో ఆయన చూపిస్తున్న ప్రతిభ అద్భుతమని ప్రధాని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. నార్వే రాజధాని ఓస్లోలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో సాధించిన విజయం ప్రజ్ఞానంద కెరీర్‌లోనే అత్యుత్తమమైనదిగా నిలిచిపోతుంది. ఈ టోర్నమెంట్‌లో ఒక దశలో వెనుకబడిన చెన్నై యువ సంచలనం ప్రజ్ఞానంద, ద్వితీయార్థంలో అద్భుతంగా పుంజుకుని ప్రపంచ అత్యుత్తమ ఆటగాళ్లను ఓడించారు. చివరి రౌండ్‌కు ముందు అమెరికా గ్రాండ్‌మాస్టర్ వెస్లీ సో స్వల్ప పాయింట్ల ఆధిక్యంతో టైటిల్ రేసులో ముందున్నారు. అయితే చివరి క్లాసికల్ గేమ్‌లో వెస్లీ సో డ్రా చేసుకోవడంతో ప్రజ్ఞానందకు సువర్ణావకాశం లభించింది. ఆఖరి పోరులో జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌ను తెల్ల ముక్కలతో ఎదుర్కొన్న ప్రజ్ఞానంద, ఒత్తిడిని అధిగమించి అద్భుతమైన ఆటతీరుతో విజయం సాధించారు. వరుసగా నాలుగో క్లాసికల్ విజయాన్ని నమోదు చేయడం ద్వారా పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుని నార్వే చెస్ చాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ టోర్నమెంట్‌లో ప్రపంచ నంబర్ వన్ మాగ్నస్ కార్ల్‌సన్, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ డి గుకేష్, వెస్లీ సో, అలీరెజా ఫిరౌజ్జా వంటి దిగ్గజాలు బరిలో నిలిచారు. ఇంతటి కఠినమైన పోటీలో ప్రజ్ఞానంద కేవలం ఒకే వారంలో కార్ల్‌సన్, గుకేష్, ఫిరౌజ్జా, కీమర్లను క్లాసికల్ గేమ్‌లలో ఓడించడం విశేషం. ముఖ్యంగా హోమ్ గ్రౌండ్‌లో ఆడుతున్న ప్రపంచ నంబర్ లిఖించుకున్నారు. ఈ అద్భుత ప్రదర్శన ద్వారా లైవ్ రేటింగ్స్‌లో ఆయన ప్రపంచవ్యాప్తంగా 11వ స్థానానికి ఎగబాకారు.

# రామాయణ, వారణాసి బడ్జెట్ లెక్కలు హైప్ క్రియేట్ చేస్తున్నారని కొట్టి పారేసిన మనోజ్



రామాయణ' పై 4000 కోట్ల బడ్జెట్ పెట్టారు. పాన్ ఇంటర్నేషనల్ మూవీ 'వారణాసి', 1300 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతోంది. రామాయణ, వారణాసి బడ్జెట్ షాక్ ఇస్తోంది. అయితే ఇందులో ఎంతమాత్రం నిజం లేదని ఇదంతా కేవలం హైప్ క్రియేట్ చేయడానికే అని బాలీవుడ్ యాక్టర్ మనోజ్ బాజ్‌పాయ్ తేల్చి పారేసాడు. రాజమౌళి అంటేనే బ్జడెట్. తెలుగు తెరకే కాదు, ఇండియన్ సిల్వర్ స్క్రీన్‌కు భారీ బ్జడెట్, భారీ వసూళ్లు ఎలా ఉంటాయో చూపించాడు రాజమౌళి. తెలుగు సినిమా బ్జడెట్ 20 కోట్ల లోపే ఉన్న సమయంలో, 'మగధీర' పై 40 కోట్లు పెట్టించాడు. బాక్స్ ఆఫీస్ దగ్గర 50 కోట్ల మార్కు దాటిన తొలి చిత్రంగా 'మగధీర' నిలిచింది. ఇక 'బాహుబలి 2' తో రాజమౌళి సెట్ చేసిన రికార్డులు ఇప్పటికీ కొన్ని చోట్ల పదిలంగానే ఉన్నాయి. మరి ఇంత ట్రాక్ రికార్డు ఉన్న రాజమౌళి, 'వారణాసి' తో పాన్ ఇంటర్నేషనల్‌కు పరిచయం అవుతున్నాడు. దీనికి తగ్గట్టే బ్జడెట్ పెంచేసాడు. 'వారణాసి' 800 కోట్ల బ్జడెట్‌తో మొదలైంది. సెట్స్ పైకి వెళ్ళాక 1000 కోట్లు అన్నారు. ఏడాది పాటు షూటింగ్ పూర్తి చేశాక, 1300 కోట్లకు వెళ్ళిందన్నారు. సినిమా పూర్తి అయ్యేసరికి 1500 కోట్లకు చేరినా ఆశ్చర్యం లేదు. బాలీవుడ్ యాక్టర్ మనోజ్ బాజ్‌పాయ్, రామాయణ, వారణాసి బ్జడెట్‌పై చేసిన షాకింగ్ కామెంట్స్ వైరల్ అయ్యాయి. ఈ సినిమాల బ్జడెట్ లెక్కలన్నీ కేవలం పిఆర్ టీం స్టంట్ అని ఆయన అభిప్రాయపడ్డాడు. 15 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఇదే తంతు నడుస్తోందని, హైప్ కోసం చెప్పే నంబర్స్ అంటూ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. 4 వేల కోట్ల బ్జడెట్‌తో హిందీ 'రామాయణ' తెరకెక్కుతోంది. ఒక్కో పార్ట్‌కు 2000 కోట్లు ఖర్చు పెడుతున్నారు. దాదాపు సగం పైగా బ్జడెట్ విఎఫ్ఎక్స్ కే ఖర్చు పెడుతున్నారట. ఎన్ని కోట్లు పెట్టినా 4000 కోట్ల బడ్జెట్ అనేది నమ్మేలా లేదంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మనోజ్ బాజ్‌పాయ్ చెప్పిన పిఆర్ టీం బ్జడెట్ లెక్కల్లో ఎంత నిజం ఉందో లేదో గానీ, ఈ కామెంట్స్ పెద్ద చర్చకు దారితీశాయి. మనోజ్ నటిస్తున్న 'గవర్నర్' మూవీ 12న రిలీజ్ అవుతోంది. సినిమా వస్తోందన్న సంగతి చాలామందికి తెలియడం లేదు, అందుకే తన సినిమాకు హైప్ తీసుకొచ్చేందుకే ఇలా మాట్లాడాడంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు.



## జూలై నుంచి కల్కి-2 రెగ్యులర్ షూటింగ్

ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న 'కల్కి 2' అప్‌డేట్ గురించి నాగ్ అశ్విన్ క్లారిటీ ఇచ్చారు. సినిమా పనుల గురించి వివరణ చేస్తూ.. కల్కి 2 షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. వచ్చే జూలై నుండి కంటిన్యూగా షూటింగ్ ప్లాన్ చేశాం. చాలా శరవేగంగా షూటింగ్ పూర్తి చేసేలా అన్ని సన్నాహాలు జరుగుతున్నాయని నాగ్ అశ్విన్ వెల్లడించారు. ఈ అప్‌డేట్‌తో ప్రభాస్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.



## కాక్‌టెయిల్-2 లో నటించడానికి భయపడ్డా: రష్మిక

కొద్ది రోజుల్లో 'కాక్‌టెయిల్ 2'తో ప్రేక్షకుల్ని అలరించడానికి ముస్తాబవుతోంది అందాల తార రష్మిక. ఆమె, షాహిద్ కపూర్, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమిది. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో దియా పాత్రలో కనిపించనుంది రష్మిక. ఈ నేపథ్యంలోనే ఓ కార్యక్రమంలో పాల్గొన్న రష్మిక.. ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. 'ఈ ప్రాజెక్టులో నటించడం గురించి నేను అంత సులభంగా నిర్ణయం తీసుకోలేదు. ముఖ్యంగా ఇందులో నటించడానికి నిజంగా భయపడ్డాను. ఎందుకంటే ఇప్పటి వరకు నేను భాగమైన చిత్రాల్లో ఇంత మోడ్రన్‌గా కనిపించలేదు. అందుకే ప్రారంభంలో ఈ చిత్రంలో నటించడం గురించి నేను తీసుకున్న నిర్ణయం సరైందా? కాదా? అనే సందేహం ఉండేది. కానీ అదే సమయంలో ఇంతకు ముందెప్పుడూ ఇలాంటి పాత్రలో చేయలేదు కాబట్టి.. ఇందులో నటించాను' అని చెప్పింది.

## విమర్శలు కూడా సృజనాత్మకతగానే చూడాలి నటి అనసూయా భరద్వాజ్

సినిమా అంటేనే కేవలం కల్పిత కథ అని.. అందులోని తప్పొప్పులు నిర్ణయించుకునే పూర్తి విచక్షణ మనపైనే ఉంటుందని నటి అనసూయ భరద్వాజ్ అన్నారు. సమాజంలో జరిగే విషయాలకు సినిమాలతో ముడిపెట్టొద్దని అన్నారు. చిత్రరంగంపై బాధ్యత, సృజనాత్మక స్వేచ్ఛ గురించి ఆమె సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. 'ఒకప్పటి కథలలో నైతికత కనిపించేది. హీరో పాత్రలు స్ఫూర్తిదాయకంగా ఉండేవి. విలన్ పాత్రలు మనం అనుకరించకూడదు అనిపించేలా ఉండేవి. ఈ రోజుల్లో తెరకెక్కే కథల్లో ఈ స్పష్టత లోపిస్తోంది. పాత్రను గొప్పగా చూపించడం కోసం దర్శకులు ఈ గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. ఒక కథను తెరకెక్కిస్తు న్నామంటే.. దాని ప్రభావం ఎలా ఉంటుందనే దానిలో టెక్నికల్ టీమ్ నుంచి దర్శక నిర్మాతలు, నటీనటులు, చివరకు ప్రేక్షకులు కూడా కీలక పాత్రధారులే. అందుకే సినిమా ఎప్పుడూ బాధ్యతాయుతంగా ఉండాలి. సృజనాత్మకత విషయంలో వచ్చిన భేదాభిప్రాయాల వల్ల నేను కొన్ని షోల నుంచి వైదొలిగిన సందర్భాలూ ఉన్నాయి. దానివల్ల నా ప్రతిభకు తగిన అవకాశాలు రావడంలో ఇబ్బందులూ ఎదుర్కొన్నా. అంత కష్టంలోనూ నా సిద్ధాంతాల కోసమే నిలబడ్డాను అని అనసూయ చెప్పారు. సృజనాత్మక స్వేచ్ఛ అనేది చాలా అవసరం. అదే సమయంలో సామాజిక స్పృహ ఉండటం కూడా అంతే ముఖ్యం. సినిమాలు సమాజాన్ని మంచి మార్గంలో ముందుకు నడిపించాలని ఆశించకూడదు. అలాగని సమాజంపై ఎలాంటి ప్రభావం చూపవని కూడా అనుకోకూడదు. సమాజంలో జరిగే ప్రతి విషయానికి సినిమాను నిందించలేం. సోషల్ మీడియాలో చాలామంది ముందుకువచ్చి ఇలాంటి విషయాలపై చర్చలు పెట్టడం, కథల్లో పాత్రలను చూపించే విధానాలను ప్రశ్నించడం, విమర్శనాత్మకంగా ఆలోచించడాన్ని చూస్తుంటే నాకు నిజంగా సంతోషంగా ఉంది. అవసరమైనప్పుడు తప్పులను ప్రశ్నించడం అంటే సృజనాత్మకతపై దాడి చేయడం కాదు, అది సమాజంలో అవగాహన పెంచడం మాత్రమే' అని అనసూయ వివరించారు.



## 200 కోట్ల క్లబ్‌కు చేరువగా పెద్ది

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద సంచలన వసూళ్లతో దూసుకుపోతోంది. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కించిన ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా విడుదలైన తొలి షో నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను అందుకుంది. భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఇప్పుడు కలెక్షన్ల పరంగా కూడా తన సత్తా చాటుతోంది. వర్కింగ్ డేస్‌లో విడుదలైనప్పటికీ 'పెద్ది' సాధిస్తున్న వసూళ్లు ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. మొదటి రోజు నుంచే బాక్సాఫీస్ వద్ద భారీ ప్రభంజనం సృష్టించిన ఈ సినిమా, రెండో రోజు కూడా అదే జోరును కొనసాగించడం విశేషంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదలైన 'పెద్ది' మొదటి రోజే రూ.130 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించి రామ్ చరణ్ కెరీర్‌లోనే అతిపెద్ద ఓపెనింగ్స్‌లో ఒకటిగా నిలిచింది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తర భారతదేశం, ఓవర్సీస్ మార్కెట్లలో కూడా సినిమాకు మంచి ఆదరణ లభించింది. ప్రత్యేకంగా నార్త్ అమెరికా, ఆస్ట్రేలియా, గల్ఫ్ దేశాల్లో 'పెద్ది' ప్రీమియర్ షోలు మరియు తొలి రోజు వసూళ్లు అద్భుతంగా నమోదయ్యాయి. దీంతో సినిమా మొదటి రోజే బ్లాక్‌బస్టర్ దిశగా అడుగులు వేసింది. సాధారణంగా భారీ సినిమాలకు మొదటి రోజు తర్వాత వసూళ్లు కొంత తగ్గడం సహజం. అయితే 'పెద్ది' విషయంలో అలాంటి పరిస్థితి కనిపించలేదు. రెండో రోజు కూడా ప్రపంచవ్యాప్తంగా మరో రూ.50 కోట్ల గ్రాస్‌ను ఈ చిత్రం రాబట్టినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. దీంతో కేవలం రెండు రోజుల్లోనే సినిమా మొత్తం రూ.181.8 కోట్ల గ్రాస్ వసూళ్లను అందుకుని మరో అరుదైన మైలురాయిని చేరుకుంది.




PRINTED AND PUBLISHED by VASISTA PRINTERS 18-97, 306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, SAROORNAGAR, RANGAREDDY, TELANGANA - 500060, RNI No :TGTEL/25/A4284 EDITOR KOMMU SRINIVAS, Contact - 9666023180 & 8096660656